


మాట మడతేసి

ఐదేళ్ల కిందట ఓటేసి ఒకే ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటూ జగన్‌రెడ్డి జిల్లాలో పాదయాత్ర చేశారు. వెళ్లిన చోటల్లా హామీలు ఇచ్చారు. అద్భుతం జరుగుతుందనే నమ్మకం కలిగించారు. గెలిచాక మడమ తిప్పేశారు.మాట మడతేసేశారు. ఏందయ్యా జగనయ్యా ఇది.. అనడిగితే.. అబ్బే.. మేనిఫెస్టోలో నేను పెట్టలేదు కదా అని దబాయిస్తారు. గాల్లో ఎగిరొచ్చి వెళ్లిపోవడం తప్ప ఈ ఐదేళ్లలో ఒక్కసారి కూడా జనంలోకి రాని ముఖ్యమంత్రి తొలిసారి నేడు బులెట్ ప్రూఫ్ బస్సులో వస్తున్నారు. మళ్లీ నాకే ఓటేయండి అని అడగబోతున్నారు. జనం చెవిలో అబద్ధాల పూలు మరోసారి పెట్టబోతున్నారు. జనం మాత్రం తక్కువ తిన్నారా... దబాయింపు , దౌర్జన్యం పాలనగా సాగిన కాలంలో మౌనంగా ఉండిపోయారుగానీ ఎన్నికల వేళ జగన్‌రెడ్డి పాత హామీలను గుర్తు చేసుకుంటున్నారు. ఒక్కటీ అమలు చేయకుండా మరో ఛాన్సివ్వండి అక్కచెల్లెమ్మలూ అని మాయ చేయడానికి వస్తున్నాడని అంటున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

తెరుచుకోని మన్నవరం పరిశ్రమ



శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద కేంద్ర ప్రభుత్వం బీహెచ్ఇఎల్-ఎన్‌టీపీసీ సంయుక్త ఆధ్వర్యంలో మెగా ప్రాజెక్టు మంజూరు చేసింది. 2010 సెప్టెంబరు 1న నాటి ప్రధాని మన్మోహన్‌సింగ్ శంకుస్థాపన చేశారు. రూ. 6500 కోట్ల అంచనా విలువతో చేపట్టిన ఈ ప్రాజెక్టు ద్వారా 30 వేల మందికి ఉపాధి లభిస్తుందని, వంద వరకూ అనుబంధ పరిశ్రమలు వస్తాయని అంచనా. అయితే బెల్, ఎన్‌టీపీసీ చెరి రూ. వంద కోట్లు చొప్పున రూ. 200 కోట్లు మాత్రమే విడుదల చేశాయి. ఈ నిధులతో పరిపాలనా భవనం, యాష్ ప్లాంట్, ప్రహరీ మాత్రమే పూర్తయ్యాయి. విద్యుత్ పరికరాలు, ఉపకరణాల తయారీ ప్లాంట్లు ఏర్పాటు కాలేదు. దీంతో ఈ యూనిట్ అసంపూర్తిగా మూతపడింది. గత ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా జగన్ మన్నవరం ప్రాజెక్టు పనులు జరగడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ళు దాటినా మన్నవరం ఫ్యాక్టరీని తెరిపించే దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

మళ్లీ ఓట్లకోసం వచ్చారా?

ఒక్క వాగ్దానమూ నెరవేర్చని నేతగా చరిత్ర సృష్టించిన ముఖ్యమంత్రి

శ్రీకాళహస్తిలో పరిశ్రమలు పెడతామన్నారు!

శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల పరిధిలో పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని గత ఎన్నికల ప్రచారంలో జగన్ వాగ్దానం చేశారు. ఈ మూడు మండలాల్లో డిక్సన్, టీసీఎస్, సెల్‌కాన్, రాక్‌వన్, స్పాంజి ఐరన్, విష్ణు కెమికల్స్, శ్రీకాళహస్తి పైప్స్, కోకో కోలా, మన్నవరం, టైల్స్, కజారియా, గ్రీన్‌ప్లై వంటి ప్రముఖ సంస్థలున్నాయి. అయితే ఒకటి రెండు పాత పరిశ్రమలు కాగా మిగిలినవన్నీ గత టీడీపీ ప్రభుత్వంలో ఏర్పాటైనవే. గత ఐదేళ్ళలో ఒక్కటంటే ఒక్క పరిశ్రమ కూడా ఈ మూడు మండలాల్లో ఏర్పాటు కాలేదు.

యుద్ధప్రాతిపదికన గాలేరు-నగరి ప్రాజెక్టు పూర్తి చేసి జిల్లాలో పశ్చిమ మండలాలను కరువుకాటకాల నుంచీ శాశ్వతంగా కాపాడతా... మూతపడిన సహకార చక్కెర ఫ్యాక్టరీ తెరిపిస్తా... నల్లబెల్లంపై ప్రభుత్వం విధించిన ఆంక్షలు ఎత్తివేయిస్తా... శ్రీసిటీలో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇప్పిస్తా... శ్రీకాళహస్తి వద్ద మన్నవరం బెల్-ఎన్‌టీపీసీ పరిశ్రమ పని చేసేలా కృషి చేస్తా... సోమశిల-స్వర్ణముఖి పనులు పూర్తి చేస్తా... పాడి రైతులకు ప్రతి లీటరుపై రూ. 4 సబ్సిడీ ఇస్తా... వ్యవసాయ విద్యుత్ కోసం దరఖాస్తు చేసుకున్న పది రోజుల్లోనే కనెక్షన్ ఇప్పిస్తా... నగరిలో టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటు చేయిస్తా... రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తా.... ఇలా 2018లో పాదయాత్రలోనూ, 2019లో ఎన్నికల ప్రచారంలోనూ వైసీపీ అధినేత జగన్ ఇచ్చిన సవాలక్ష హామీలు జిల్లా ప్రజల్ని ఆశల పల్లకిలో విహరించేలా చేశాయి. జగన్ మాటలు నమ్మిన జిల్లా జనం చిన్నగొట్టిగల్లు నుంచీ తడ వరకూ, పుత్తూరు నుంచీ డక్కిలి వరకూ ఆ పార్టీకి జనం ఓట్ల వర్షం కురిపించారు. ఒక పార్లమెంటు స్థానంతో పాటు మొత్తం ఎనిమిది అసెంబ్లీ స్థానాల్లోనూ గెలిపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చి, జగన్ ముఖ్యమంత్రి పీఠమెక్కి ఐదేళ్ళు గడచిపోయాయి. కార్మికులు, ఉద్యోగులతో కళకళలాడాల్సిన గాజుల మండ్యం చక్కెర ఫ్యాక్టరీ, మన్నవరం విద్యుత్ ఉపకరణాల పరిశ్రమ ముళ్ళ పొదల మాటున దీనావస్థను చాటుకుంటున్నాయి. కృష్ణా జలాలు ప్రవహించాల్సిన గాలేరు-నగరి కాలువలు ఒక్క అడుగు కూడా తవ్వకాలకు నోచుకోక గట్టిగా నిట్టూరుస్తున్నాయి. అమ్ముడుపోక పల్లెల్లో పేదలు దాచుకున్న నల్లబెల్లం ఎక్సైజ్ దాడుల్లో బయటపడి సారా కోసం దాచారంటూ కేసుల పాలు చేస్తోంది. ఇలా చెప్పుకుంటూ పోతే జగన్ ఇచ్చిన హామీలు ఈ ఐదేళ్ళలో ఒక్కటి కూడా నెరవేరలేదు. నమ్మి ఓట్లేసి పార్టీని గెలిపించిన తమను ఆయన నిలువునా వంచించారని జిల్లా ప్రజలు వాపోతున్న పరిస్థితి. ఇపుడు మళ్ళీ ఎన్నికలు వచ్చిన తరుణంలో జిల్లాలో పర్యటిస్తున్న ఆయనకు గత హామీలను జనం గుర్తు చేస్తున్నారు.

గాజులమండ్యం షుగర్స్‌ను తెగనమ్మే ప్రయత్నం



దశాబ్దాల పాటు జిల్లాలో వేలాది చెరకు రైతుల కుటుంబాలకు ఆలంబనగా నిలిచిన గాజుల మండ్యం శ్రీవెంకటేశ్వర సహకార చక్కెర ఫ్యాక్టరీ నిర్వహణాపరమైన లోపాలతో నష్టాలకు లోనై 2015లో మూతపడిన సంగతి తెలిసిందే. ఇందులో 300మంది దాకా పనిచేసేవారు. జగన్ పాదయాత్రలో మూతపడిన ఫ్యాక్టరీని తెరిపిస్తామని వాగ్దానం చేశారు. అధికారంలోకి వచ్చాక దీని పునరుద్ధరణకు గల అవకాశాలను అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీ వేశారు. ఫ్యాక్టరీని తిరిగి తెరిపిస్తారని రైతులు, ఉద్యోగులు ఆశపడితే ప్రభుత్వం ఏకంగా ఫ్యాక్టరీనే విక్రయించేందుకు రంగం సిద్ధం చేసింది. లిక్విడేటర్‌ను కూడా నియమించింది. ఆవరణలోని 800కు పైగా చెట్లు నరికించి విక్రయించేందుకు వేలం పాటలు సైతం నిర్వహించింది. ఫ్యాక్టరీని ప్రైవేటు పరంచేసే ప్రయత్నాలను రైతులు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం ద్వారా అడ్డుకున్నారు.

గూడూరు ఆర్వోబీ గుర్తుందా?



గూడూరు పట్టణాన్ని రెండుగా విభజిస్తున్న రైల్వేలైన్ పై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయి వుండడంతో గత ఎన్నికల ప్రచారంలో జగన్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. తాను అధికారంలోకి రాగానే ఆరు నెలల్లో బ్రిడ్జి నిర్మాణం పూర్తిచేయిస్తామని హామీ ఇచ్చారు. గూడూరు ఒకటో, రెండో పట్టణాల నడుమ రాకపోకలు సాగించేందుకు 2011 మార్చిలో రూ. 39 కోట్లతో ఫ్లైఓవర్ పనులు చేపట్టారు. స్థానిక ఐసీఎస్‌రోడ్డు వైపు, అడివయ్య కాలనీ వైపు, సిరామిక్ కళాశాల వైపు మూడు స్పాన్లుగా నిర్మించేలా చర్యలు తీసుకున్నారు. రూ. 16 కోట్లతో రైల్వే శాఖ పట్టాలపై ఫ్లైఓవర్ పనులను పూర్తిచేసింది. రూ. 23 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. 2014లో పనులు నిలిచిపోవడంతో 2015 డిసెంబరులో భూసేకరణ, వంతెన నిర్మాణానికి రూ. 63కోట్లు మంజూరయ్యాయి. అయినా పనులు జరగలేదు. జగన్ హామీ ఇచ్చి ఐదేళ్ళు పూర్తవుతున్నా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాలేదు.తిరుపతి, చెన్నై వైపు రైళ్ల వేళ్లే మార్గాల్లో రైలు గేట్లు వేస్తుండడంతో రెండు పట్టణాల వైపు రాకపోకలు సాగించే ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సివస్తుంది.

అపాచీ పేరుతో ఆర్భాటం



శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు వద్ద భారీ పాదరక్షలు పరిశ్రమ అపాచీ కంపెనీ నెలకొల్పుతున్నట్లు వైసీపీ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. 2022 జూన్ 23న సీఎం జగన్ ఇలగనూరులో పరిశ్రమ స్థాపనకు భూమి పూజ చేశారు. ఆ తర్వాత పరిశ్రమ నిర్మాణపరంగా ఒక అడుగు కూడా ముందుకు పడలేదు. కనీసం భూమి పూజ జరిగిన చోట శంకుస్థాపన శిలాఫలకం ఆనవాళ్లు కూడా లేకుండా మాయం చేశారు.

శ్రీసిటీలో స్థానికులకేవీ 75 శాతం ఉద్యోగాలు?



శ్రీసిటీ పరిధిలో మొత్తం 150కి పైగా పరిశ్రమలుండగా సుమారు 50వేల మంది ఉద్యోగులు, కార్మికులు పనిచేస్తున్నారు. ఉపాధి పొందుతున్న వారిలో తమిళనాడు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల వారు ఎక్కువమంది వుండగా రాష్ట్రంలోని ఇతర జిల్లాల వారు, కర్ణాటకకు చెందిన వారు తక్కువగానవున్నారు. ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ శ్రీసిటీ పరిశ్రమల్లో 75 శాతం ఉద్యోగాలు స్థానికులకే వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆయన పదవీ కాలం ముగుస్తున్నా ఇచ్చిన హామీని నెరవేర్చే విధంగా ఎలాంటి ప్రయత్నాలూ జరగలేదు. ఇక్కడ మొత్తం ఉద్యోగాల్లో 40శాతం మాత్రమే స్థానికులకు దక్కుతున్నాయి.

అవ్వాతాతలు

ఉసురు పోసుకున్నారు

- సచివాలయాల వద్ద వృద్ధుల పడిగాపులు
- సాయంత్రం 4 గంటలకు కూడా నోక్యాష్
- కొన్నిచోట్ల సర్వర్ల మొరాయింపు
- మొత్తమ్మీద 43శాతం పెన్షన్ల పంపిణీ





తిరుపతి ఖాదీ కాలనీ వద్ద సచివాలయానికి చేరుకుంటున్న వృద్ధ మహిళలు - తిరుపతి ఐఎస్ మహల్ రోడ్డులోని సచివాలయం వద్ద వృద్ధుల పడిగాపులు

తిరుపతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల పంపిణీ వ్యవహారాన్ని రాష్ట్రప్రభుత్వం గందరగోళంగా మార్చేసింది.దివ్యాంగులకు, వృద్ధులకు, రోగులకు ఇంటివద్దకే వెళ్లి పెన్షన్లు పంపిణీ చేయాలని, తక్కినవారికి సచివాలయాల్లో పంపిణీ పంపిణీ చేయాలంటూ జారీ చేసిన మార్గదర్శకాలు క్షేత్రస్థాయిలో గాలికొదిలేయడంతో జిల్లా వ్యాప్తంగా సచివాలయాల వద్ద పింఛనుదారులు పడిగాపులు కాయాల్సివచ్చింది. నగదుకోసం బ్యాంకులకు వెళ్లిన సచివాలయాల సిబ్బంది, సాయంత్రం 4 గంటలకు కూడా తిరిగి రాకపోవడంతో వృద్ధులకు అవస్థలు తప్పలేదు. కొన్నిచోట్ల సర్వర్లు పనిచేయకపోవడంతో మండుటెండలో గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.తగిన నీడ, తాగునీటి సౌకర్యాలుకూడా కల్పించలేదు.కొన్నిచోట్ల సచివాలయాల వద్ద టీడీపీ కార్యకర్తలు స్వచ్ఛందంగా మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేస్తే వాటిని కూడా అడ్డుకున్నారు. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో సచివాలయ సిబ్బందితో పెన్షన్లు పంపిణీ చేయించిన సందర్భాలున్నాయి. అప్పుడు చేయగలిగింది, ఇప్పుడు ఎందుకు చేయలేకపోయారని పెన్షన్ దారులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికలవేళ జగన్ స్వార్థ ప్రయోజనాల కోసం ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ఘాటుగా ప్రశ్నిస్తున్నారు. జగన్ ఆదేశాలతో అధికారులు ఉద్దేశపూర్వకంగానే పెన్షన్ల పంపిణీ ఆలస్యమయ్యేలా చేస్తున్నారని అవ్వా, తాతలు అనుమానిస్తున్నారు. తమ చేతకానితనం బయటపడకుండా తప్పించుకునేందుకు ఆ నెపాన్ని టీడీపీపై నెడుతోందని మండిపడుతున్నారు.

- ఏర్పేడు మండలంలోని 19 సచివాలయాల్లో సాయంత్రం 6 గంటల వరకు కూడా పింఛన్ల పంపిణీ జరగలేదు. మండల పరిధిలో ప్రభుత్వం నుండి రావాల్సిన పింఛన్ల మొత్తంలో 25శాతం మాత్రమే బ్యాంకులో జమకావడం వలన కొందరికిచ్చి, మరికొందరికి ఇవ్వలేకపోయారు.ఆరుగంటల తర్వాత కొంతమేర పంపిణీ చేసినట్టు తెలిసింది. కోట మండలం గూడలి సచివాలయం వద్ద నగదు తక్కువ రావడంతో పింఛన్ల కోసం ఎగబడ్డారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని గిరిజన కాలనీలో పెన్షనర్లు మూడు కిలోమీటర్లు ఎండలో నడిచి రావాల్సి వచ్చింది. తిరుపతి రూరల్ మండలం ముళ్లపూడి పంచాయితీ లబ్ధిదారులకు అక్కడ పాడిపేట సచివాలయంలో ఇచ్చారు. జిల్లాలో 271477 మంది పింఛనుదారులుండగా 116958 మందికి పంపిణీ చేశారు. అంటే 43 శాతం పంపిణీ జరిగింది. అత్యల్పంగా తడలో 9.28శాతం, డక్కిలిలో 15.49, ఓజిలిలో 15.86, కోటలో 17.55, గూడూరులో 19.21 శాతం పెన్షన్లు మాత్రమే ఇవ్వగలిగారు. బీఎన్‌కండ్రిగ, కేవీబీపురం మండలాల్లో అత్యధికంగా 70 శాతానికి పైగా పెన్షన్ల పంపిణీ జరిగింది.

ప్రతి ఒక్కరికీ పింఛన్లందిస్తాం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 3:అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక పింఛన్లు అందజేస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఇన్‌ఛార్జి కలెక్టర్ ధ్యానచంద్ర బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2,71,477మందికి విడుదలైన పింఛన్లలో బుధవారం సాయంత్రం 7గంటల వరకు 43.08 శాతం మందికి అందించినట్ల తెలిపారు. రెండు రోజుల్లో అందరికీ అందజేస్తామన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న కారణంగా నడవలేనివారు, ఆరోగ్యం సరిలేనివారు ఇంటి వద్దనే ఉండాలని అలాంటి వారికి ఇంటివద్దకు వచ్చి పింఛన్లు అందజేస్తామని తెలిపారు.

పెన్షన్ తీసుకునేందుకు

వెళ్లి ఇద్దరి మృతి

సూళ్లూరుపేట/ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 3:పెన్షన్ తీసుకునేందుకు వచ్చి ఇద్దరు మృత్యు వాత పడ్డారు. సూళ్లూరుపేట పట్టణం గాండ్లవీధిలో వున్న సచివాలయం వద్దకు బుధవారం మధ్యాహ్నం సాయినగర్‌కు చెందిన లలితమ్మ(58) వెళ్లింది. కుర్చీలో కూర్చొని ఉండగా చేతిలో ఉన్న ఆధార్ కార్డు పడిపోయింది.దాన్ని తీసుకొనేందుకు కుర్చీలో నుంచి లేచే ప్రయత్నంలో కిందపడిపోయింది. వెంటనే ఆమెను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా వైద్యులు పరిశీలించి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. ఎర్రావారిపాలెం మండలం నెరబైలుకు చెందిన నన్నె సాహెబ్ (68) ఇంటికి 100 మీటర్ల దూరంలో వున్న సచివాలయానికి బుధవారం పెన్షన్ తీసుకుందామని నాలుగు సార్లు వెళ్లొచ్చాడు. మధ్యాహ్నం 2.45గంటలకు మరోసారి వెళ్ళాడు. ఎండ వేడి ఎక్కువగా ఉండడం, నిరీక్షణ వల్ల ఫైకం కమ్మి కుప్పకూలిపోయాడు.వెంటనే 300మీటర్ల దూరంలో వున్న ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఆస్పత్రిలో డాక్టరు లేకపోవడంతో పరిశీలించిన వైద్యసిబ్బంది అప్పటికే మరణించినట్టు తెలిపారు.



నన్నె సాహెబ్ (ఫైల్‌ఫొటో)



కార్యకర్తలున్నా

ఆగని జగన్ బస్సు

- చీకట్లో చేతులూపుతూ సాగిపోయిన సీఎం

తిరుపతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పల్లెలే కాదు పట్టణాలు, ప్రధాన కూడళ్లలో కూడా సీఎం జగన్ బస్సు యాత్ర ఆగలేదు. నేతలు తరలించిన కార్యకర్తలు పెద్దసంఖ్యలో గంటల కొద్దీ నిరీక్షిస్తున్నా కనీసం బస్సు ఆపే ప్రయత్నం చేయలేదు. చీకట్లో చేతులూపుతూ సీఎం ముందుకు సాగిపోయారు.మేమంతా సిద్ధం పేరిట జగన్ చేపట్టిన బస్సు యాత్రకు బుధవారం రాత్రి పాకాల మండలం గాదంకి టోల్‌ప్లాజా వద్ద స్వాగతం పలికేందుకు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి పెద్దసంఖ్యలో కార్యకర్తలను తరలించారు. రాత్రి 7.50గంటలకు టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న బస్సు ఆపి జగన్ కిందకు దిగుతారని కార్యకర్తలు వేచి చూస్తుండగా కనీసం స్లో కూడా చేయకుండా బస్సు వేగంగా దూసుకుపోయింది. బస్సులో నుంచే శ్రేణులకు చేతులూపుతూ జగన్ ముందుకు సాగిపోయారు. దీంతో కార్యకర్తలు తీవ్ర నిరాశకు గురయ్యారు. అలాగే చంద్రగిరి పట్టణం వెలుపల జాతీయ రహదారి పై ఓవర్ వద్ద ఎమ్మెల్యే చెవిరెడ్డి భారీ ఎత్తున కార్యకర్తలను సమీకరించారు.అక్కడ కూడా స్లోగా వెళుతున్న బస్సు అద్దాల లోంచి జగన్ చేతులూపుతూ వెళ్ళిపోయారు. వినతి పత్రం ఇచ్చేందుకు వేచి వున్న ఓ కార్యకర్త బస్సు ఆపకపోవడంతో అడ్డుపడ్డాడు. అయితే పోలీసులు అతన్ని దురుసుగా పక్కకు లాగేశారు. కాగా జగన్ బస్సు వెళుతున్న సమయంలో కార్యకర్తల్లో తొక్కిసలాట జరిగి సుకన్య (40) అనే మహిళ స్పృహ కోల్పోయింది.బస్సు యాత్ర సందర్భంగా చిత్తూరు మార్గంలో అరగంట పాటు వాహనాల రాకపోకలను నిలిపివేయడంతో ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

ట్రాఫిక్‌లో చిక్కుకున్న అంబులెన్సు

జగన్ బస్సు యాత్ర గాజులమండ్యం కూడలి చేరుకునే సమయానికి జనం ఎవ్వరూ లేరు. పోలీసులు అరగంట పాటు వాహనాల రాకపోకలను నిలిపివేశారు. దీంతో పుత్తూరు నుంచీ వస్తున్న 108 అంబులెన్సు ట్రాఫిక్‌లో చిక్కుకుంది. అంతకు మునుపు తిరుపతి శివార్లలోని ఉప్పరపల్లి వద్ద కూడా బైపాస్ రోడ్డు -తిరుపతి మార్గంలో రాకపోకలు ఆపేశారు. తిరుచానూరు క్రాస్ వద్ద కూడా పెద్దసంఖ్యలో కార్యకర్తలు నిరీక్షిస్తున్నా బస్సు ఆపలేదు.బస్సును ఆపేందుకు యత్నించిన కార్యకర్తలను, మహిళలను కూడా పోలీసులు నెట్టేశారు.

నేడు నాయుడుపేటలో బహిరంగసభ

రేణిగుంటలో బుధవారం రాత్రి బస చేసిన జగన్ గురువారం నాయుడుపేటలో జరిగే మేమంతా సిద్ధం సభలో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు బస్సు యాత్ర తిరిగి ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12.30 గంటలకు తొట్టంబేడు మండలం పొయ్య గ్రామంలో లారీ, ఆటో డ్రైవర్లతో జగన్ సమావేశమవుతారు. సాయంత్రం 4.30 గంటలకు నాయుడుపేట చేరుకుని సభలో పాల్గొంటారు. అనంతరం నెల్లూరు రూరల్ మండలం చేరుకుని రాత్రి బస చేస్తారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (గురువారం) : సా. 6.28
సహరి (శుక్రవారం) : ఉ. 4.46

స్నేహితుడి కోసం వెళ్లి హత్యకు గురైన యువకుడు

● సెల్‌ఫోన్ విషయమై తనపల్లి హౌసింగ్ కాలనీలో ఘటన


మృతుడు సునీల్

తిరుచానూరు, ఏప్రిల్ 3: సెల్‌ఫోన్ విషయమై జరిగిన గొడవలో స్నేహితుడి కోసం వెళ్లిన ఓ యువకుడు హత్యకు గురైన ఘటన తిరుపతి రూరల్ మండలం తనపల్లి హౌసింగ్ కాలనీలో తీవ్ర కలకలం రేపింది. తిరుచానూరు సీఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపిన మేరకు వివరాలి ఇలా.. తనపల్లి హౌసింగ్ కాలనీలో సింగారం అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అతని వద్ద దుర్గాప్రసాద్ అలియాస్ నాని అనే యువకుడు సెల్‌ఫోన్ కుదవ పెట్టాడు. అయితే డబ్బు చెల్లించి తన ఫోన్ ఇవ్వాలని మూడురోజులుగా సింగారం ఇంటికి వెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అది కాస్త గొడవకు దారితీసింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సింగారం ఇంటికి వెళ్లిన దుర్గాప్రసాద్ డబ్బు క ట్టేసినా సెల్‌ఫోన్ ఎందుకు ఇవ్వలేదని గొడవపడటంతో సింగారం ఇంటి పక్కన ఉన్న పద్మావతి అనే మహిళ వారించింది. మాటమాట పెరిగడంతో ఆమెపై దుర్గాప్రసాద్ చేయిచేసుకున్నాడు. దీంతో పద్మావతి కుమారులు చరణ్, మణికంఠ కలిసి దుర్గాప్రసాద్‌పై దాడి చేయడంతో తనపై దాడి జరిగిందని.. వెంటనే రావాలని కుంట్రపాకంకు చెందిన తన స్నేహితుడు సునీల్‌కు దుర్గాప్రసాద్, ఫోన్ చేయడంతో దీంతో సునీల్ మరో కొంతమంది అక్కడికి చేరుకుని పద్మావతి కుటుంబపైకి గొడవకు దిగారు. పరస్పర గొడవల్లో పద్మావతి కుమారులు సునీల్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడి స్నేహితులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా సునీల్ అలియాస్ సునీల్‌కుమార్‌రెడ్డి(23) మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం పోస్టుమార్టం అనంతరం సునీల్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. మణికంఠ, చరణ్ తదితరులపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. అయితే ఈ గొడవలో పాల్గొన్న కొంతమంది యువకులు గంజాయి మత్తులో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల తనిఖీ

రామచంద్రాపురం, ఏప్రిల్ 3: మండలంలోని ఆరు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో నిశాంత్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 14 తేదీ వరకు అర్హత కలిగిన వారికి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ తనిఖీల్లో తహసీల్దారు ఉషారాణి, ఎ న్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలస్యంగా పింఛన్ల పంపిణీ ప్రారంభం



రామచంద్రాపురం, ఏప్రిల్ 3: మండలంలోని 14 సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ బుధవారం ఆలస్యంగా ప్రారంభమైంది. సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన షె డ్లలో ఉదయం నుంచే భారీగా చేరుకున్న వృద్ధులకు నగదు లేకపోవడంతో మధ్యాహ్నం వరకు పంపిణీ చేయలేదు. 2గంటలనుంచి పింఛన్లు ప ంపిణీచేశారు.

ఎంబీయూలో ఎన్‌సీఏబీసీడీపై సదస్సు


అతిథులకు సన్మానం

చంద్రగిరి, ఏప్రిల్ 3:చంద్రగిరి మండలం ఎ.రంగంపేట సమీపంలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటింగ్ అండ్ డేటా సిస్టమ్‌పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. సదస్సుకు బ్యాంకాక్ దేశానికి చెందిన తాయి గ్రీన్ పవర్ సొల్యూషన్ సంస్థ ప్రతినిధులు కందస్వామి, మురగేసన్, పోనసన డేవిడ్, తమిళనాడు కాంచీపురంలోని ఐఐఐటీడీఎం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన డాక్టర్ నూర్‌మహ్మద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అధ్యాపకులు, విద్యార్థులు తమ పరిశోధన వ్యాసాలపై చర్చించారు. ఎంబీయూ ఉపకులపతి నాగరాజ రామారావు ,రిజిస్ట్రార్ సారథి, డీన్ బీఎం సతీష్, విజయ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న ఆలయంలో పుష్పయాగానికి అంకురార్పణ



సేనాధిపతి ఉత్సవం

చంద్రగిరి ఏప్రిల్ 3: శ్రీనివాస మంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం జరగనున్న పుష్పయాగానికి బుధవారం సాయంత్రం అంకురార్పణ శాస్త్రోక్తంగా జరిగింది. సాయంత్రం 6 నుంచి పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ నిర్వహించారు. గురువారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పుష్పయాగం జరగనుంది. బుధవారం అష్టోత్తర శత కళశాభిషేకం, గురువారం తిరుప్పావడ, నిత్య కల్యాణోత్సవ సేవలను టీటీడీ రద్దు చేసింది.డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్లు మునిచెంగల్రాయులు, వెంకటస్వామి, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, శేషాద్రిచార్యులు, పార్థసారథి, నారాయణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు వలంటీర్ల రాజీనామా

భాకరాపేట, ఏప్రిల్ 3: చిన్నగొట్టిగల్లు పంచాయతీలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మదన మోహన్ రాజు తెలిపారు.

ముంబైలో నిర్మిస్తున్న శ్రీవారి ఆలయం వచ్చే ఏడాది ప్రారంభం


గౌతమ్ సింఘానియా

తిరుమల, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ముంబైలో నిర్మిస్తున్న శ్రీవారి ఆలయాన్ని వచ్చే ఏడాది సెప్టెంబరు9న ప్రారంభించనున్నట్టు రేమండ్స్ సీఎండీ గౌతమ్ సింఘానియా వెల్లడించారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆయన దర్శించుకున్నారు.ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలి


క్రీడాకారులకు హాకీ స్టిక్స్ వితరణ చేస్తున్న రజని

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 3: విద్యతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలని భారత మహిళా హాకీ క్రీడాకారిణి రజని కోరారు. టీటీడీ విద్యాసంస్థల హాకీ క్రీడలకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్నారు. బుధవారం ఉదయం స్థానిక ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానంలో విద్యార్థులకు హాకీ పట్ల అవగాహన కల్పించారు. విధిగా సాధన చేయాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు 20హాకీ స్టిక్స్‌ను వితరణ చేశారు. టీటీడీ విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం.భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ దేవస్థానం క్రీడలకు ఎక్కువ మొత్తంలో ఖర్చుచేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వేణుగోపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్.ఎన్.ముస్తక్‌అహ్మద్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఒంగోలు కూటమి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. మాగుంట ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ ఏపీతో పాటు ఒంగోలు ప్రజలు సంతోషంగా ఉండాలని శ్రీవారిని కోరుకున్నట్టు తెలిపారు.

3..7..2

● ఎస్వీయూలో అక్రమ నియామకాల్లో అధికార పార్టీ నేతల లెక్క



12మంది నాన్ టీచింగ్ సిబ్బంది నియామకంపై వీసీని విచారించిన కమిషనర్

కోడ్‌కు ముందే నిర్ణయం తీసుకున్నామన్న వీసీ

తిరుపతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 'నీకు 3...నాకు 7...ఆయనకు 2 ...మొత్తం కలిపితే 12. ఎన్నికల కోడ్ ముందు పెట్టుకుని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన ఉద్యోగుల అక్రమ నియామక సంఖ్య ఇది. వర్సిటీ వర్గాల్లో దుమారం రేపుతున్న ఈ వ్యవహారం వెనుక అధికారపార్టీ కీలక మంత్రి ఒత్తిడే ప్రధానంగా తెలుస్తోంది. ఆయనతో పాటు చంద్రగిరి, తిరుపతికి చెందిన నేతల ఒత్తిళ్లతోనే ఎస్వీయూలో ఎన్ఎంఆర్ పద్ధతిలో 12మంది నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టినట్లు సమాచారం. దీనిపై ఎన్నికల సంఘం దృష్టిసారించి తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌ను విచారణ అధికారిగా నియమించింది. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే నిర్ణయం తీసుకున్నామని, అయితే కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత వారు విధుల్లోకి వచ్చారని వీసీ వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది.వీసీని విచారించిన కమిషనర్ వారిచ్చిన సమాచారం మేరకు నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపారు. మూడు నెలల ముందు వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి అధికార పార్టీ కీలకనేత సిఫార్సుకు 7, చంద్రగిరి నేతకు 3, తిరుపతి నాయకుడి సిఫార్సుకు 2 పోస్టుల చొప్పున ఎన్ఎంఆర్ పద్ధతిలో నాన్ టీచింగ్ సిబ్బంది ఉద్యోగాలు కట్టబెట్టేశారు.అది కూడా ఎస్వీయూ పరిపాలనా విభాగంలోని ఎగ్జామ్స్, ఈడీపీ సెల్, అకౌంట్స్, నాక్ వంటి కీలక విభాగాల్లో పోస్టింగు ఇవ్వడం వర్సిటీ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఎన్నికల కోడ్ గత నెల 16న అమల్లుకి వస్తే నియమితులైన నాన్‌టీచింగ్ సిబ్బంది మాత్రం 18వ తేదీ జాయినయ్యారు. ముందస్తు డేట్ వేసి ఉత్తర్వులు ఇచ్చినట్టు విమర్శలున్నాయి. ఎన్నోఏళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగానే కొత్తవారికి కూడా జీతభత్యాలు కల్పించడంపై పాత ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు.సిబ్బంది ఎవరో బయటకు సమాచారం ఇవ్వడంతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చిందని భావించిన నాన్ టీచింగ్ సిబ్బందిపై గుర్రుమీద ఉన్నట్టు సమాచారం. అందుకే ఇటీవల సాయంత్రం 4.30గంటలపైన విధుల్లోలేని 22 మంది నాన్ టీచింగ్ సిబ్బందికి మెమోలు జారీచేశారు.కాగా అక్రమ నియామకాలపై ఈసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు షోకాజ్

ఎస్వీయూలో అక్రమ నియామకాలపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ విచారణ జరిపి కలెక్టర్‌కు మూడు రోజుల ముందు నివేదిక పంపారు. అయితే కమిషనర్ నివేదికతో సంతృప్తి చెందనట్టు తెలుస్తోంది. నియామకాలపై ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్‌ను సమగ్రంగా వివరణ కోరుతూ తాజాగా కలెక్టర్ షోకాజ్ పంపారు. దీనిపై ఎస్వీయూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. అసలే ఆగ్రహంగా ఉన్న ఎన్నికల కమిషన్ ముందు అడ్డంగా దొరికిపోతే వేటుతప్పదన్న ఆందోళనలో ఉన్నతాధికారులు ఉన్నట్టు సమాచారం.



చంద్రగిరిలో సీఎం కాన్వాయ్ ముందు రోడ్డుపై కూర్చున్న వైసీపీ కార్యకర్త - చిత్తూరు వైపు వెళ్ళే వాహనాలను నిలిపివేసిన దృశం

జగన్ కాన్వాయ్‌ని అడ్డగించిన కార్యకర్త

చంద్రగిరి,ఏప్రిల్3: ముఖ్యమంత్రి జగన్ బస్సుయాత్రతో చంద్రగిరి మీదుగా చిత్తూరు వైపు వెళ్ళే ప్రయాణికులు అర్ధగంట పాటు జాతీయ రహదారిలో ఇబ్బందులు పడ్డారు. జగన్ బుధవారం రాత్రి 8.14 గంటలకు చంద్రగిరికి చేరుకున్నారు.చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బస్సులో ఆయనతో పాటు ఉన్నారు. చంద్రగిరికి సీఎం రాగానే ఓ కార్యకర్త వినతిపత్రాన్ని ఇవ్వడానికి కాన్వాయ్‌కి అడ్డంగా రోడ్డుపై కూర్చున్నాడు.సెక్యూరిటీ సిబ్బంది అతన్ని బలవంతంగా పక్కకు లాగేశారు.వైసీపీ కార్యకర్తల తొక్కిసలాటలో చంద్రగిరికి చెందిన సుకన్య స్పృహతప్పి పడిపోయింది. సీఎం వెళ్ళాక ఆమెను చికిత్స నిమిత్తం 108 వాహనంలో రుయాస్పత్రికి తరలించారు.


సీఎం కాన్వాయ్ వెళుతుండగా ఉప్పరపల్లె క్రాస్ వద్ద ఖాళీగా దర్శనమిస్తున్న రోడ్డు

ఉప్పరపల్లె సర్కిల్లో కానరాని జనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 3: సీఎం జగన్ ఎన్నికల ప్రచారం కోసం చేపట్టిన బస్సు యాత్రకు జనం నుంచి స్పందన అంతంత మాత్రంగానే ఉంది. తిరుపతి - నాయుడుపేట జాతీయ రహదారి మీదుగా బుధవారం బస్సు యాత్ర సాగింది. రాత్రి 8:30 గంటల సమయంలో తిరుపతి రూరల్ మండలం ఉప్పరపల్లె సర్కిల్‌కు బస్సు చేరుకుంది. అక్కడ జనం పోగవ్వకపోవడంతో సీఎం కాన్వాయ్ వెళుతుండగా ఆపి వాహనాల్లోని వారికి నమస్కారం చేసుకుంటూ ముందుకు వెళ్లారు. వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ కొందరు పోలీసులు మాత్రమే కన్పించారు.

● పోలీసుల అత్యుత్సాహం

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 3: బస్సు యాత్రలో భాగంగా సీఎం జగన్ రాక కోసం తిరుచానూరు క్రాస్ వద్ద పెద్దసంఖ్యలో వైసీపీ శ్రేణులు చేరుకున్నాయి. అయితే సీఎం బస్సు దిగకుండా లోపల నుంచే అభివాదం చేస్తూ వెళ్లిపోవడంతో నిరుత్సాహపడ్డాయి. కాగా, జగన్‌ను చూడటానికి వచ్చిన జనాన్ని పోలీసులు పక్కకు తోసేయడంతో ఇబ్బందిపడ్డారు. పైగా సీఎం తిరుచానూరు క్రాస్ నుంచి రేణిగుంట దాటే వరకు వాహనాలను అనుమతించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.




కమీషన్ల రూపంలో కోట్లు దండుకున్న టీటీడీ చైర్మన్

● ఈవోను కూడా పదవి నుంచి తొలగించాలి ● బీజేపీ నేత భానుప్రకాష్ డిమాండు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 3: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి కమీషన్ల రూపంలో కోట్లు దండుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి విమర్శించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చైర్మన్ గత ఎనిమిది నెలలకాలంలో తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారన్నారు. రూ.1,500కోట్లు ఇంజనీరింగ్ శాఖకు కేటాయించి సివిల్ పనులకు 10శాతం , రోడ్డు పనులకు 15శాతం కమీషన్ చైర్మన్‌కు ఇస్తే తప్ప పనులు ముందుకు వెళ్లడం లేదన్నారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాలకు సంబంధించి ఇంకా 15ఏళ్ల పాటు ఆ కట్టడాలకు లైఫ్ ఉందని.. అయితే రూ.50కోట్ల కమీషన్‌కు కక్కుర్తి పడి సత్రాలను తొలగించారన్నారు.అత్త సొత్తు అల్లుడి దానంలా రూ.180 కోట్లు టీటీడీ నిధులను రోడ్లపై ఖర్చు పెట్టారన్నారు. ఇక టీటీడీ ఈవో అధికార పార్టీకి సేవలు చేస్తున్నాడని... దీనిపై కేంద్ర ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు.ఇంకా ఆరువారాలపాటు ఈవో సేవలు అవసరమంటూ కేంద్రానికి సీఎం జగన్ లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు.ఓటు బ్యాంకు రాజకీయాలతో కూడా తిరుమలకు ముడిపెట్టారని ఇష్టానుసారంగా అర్హతలేని వ్యక్తులకు సైతం బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారని విమర్శించారు. ప్రైవేటు పీవోలను పెట్టుకుని ఎలాంటి అవినీతికి పాల్పడ్డారో ఆధారాలతో సహా బయట పెడతానని తెలిపారు. బడా పారిశ్రామికవేత్తలతో స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతూ అధికార పార్టీకి రూ.వందల కోట్ల ఫండ్స్ ఇప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించి ఈవో ధర్మారెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

పిలిస్తే తప్పకుండా ఎన్డీఏ అభ్యర్థుల ప్రచారానికి వస్తా

● బాలయ్య, పవన్ అంటే చాలా ఇష్టం ● ప్రముఖ నటి జయప్రద


తిరుమల ఆలయం ముందు జయప్రద

తిరుమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 'నాకు పవన్‌కల్యాణ్, బాలయ్య అంటే చాలా ఇష్టం. అలాగే చంద్రబాబు నాయుడు అంటే ప్రత్యేకమైన గౌరవం. వారు పిలిస్తే తప్పకుండా ఎన్నికల ప్రచారానికి వస్తా' అని ప్రముఖ నటి, బీజేపీ నాయకురాలు జయప్రద తెలిపారు. తాను ఇప్పటికే ఎన్నికల ప్రచారం కోసం ఇతర రాష్ట్రాలకు వెళుతున్నట్టు తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా తిరుమల శ్రీవారిని ఆమె బుధవారం దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ.. తాను యూపీలో ఉన్నా ఏపీ బిడ్డనేనన్నారు. ఏపీకి ముఖ్యంగా కావాల్సింది రాజధాని అన్నారు. రాష్ట్రానికి రాజధానితో పాటు ప్రత్యేక హోదా కూడా లేదన్నారు. ఈ రెండూ కావాలని ఈ రాష్ట్ర బిడ్డగా తాను కోరుకుంటున్నట్టు చెప్పారు. దాని కోసం తప్పకుండా ప్రయత్నిస్తానని, అయితే ఎన్నికల సమయంలో జయప్రద వాగ్దానమే సరిపోదని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి మాకు ఇది కావాలని అడిగితే వెంటనే చేయగలిగే ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరుకుంటున్నానన్నారు. ఇక, అవకాశమిస్తే ఏపీ నుంచి పోటీ చేసి ప్రజలకు సేవ చేయాలనుందన్నారు. ఇక్కడ టికెట్ ఇవ్వలేదంటే అధిష్ఠానానికి ఇంతకంటే మంచి ఆలోచన ఉండిఉండవచ్చన్నారు. పార్టీ ఏం చేసినా తన మంచి కోసమే అన్నారు. మోదీ మూడవసారి ప్రధాని కావాలని స్వామిని కోరుకున్నట్టు తెలిపారు.

పింఛన్ పాట్లు

● సచివాలయాల ముందు పడిగాపులు
● మధ్యాహ్నం 3గంటలపైన పంపిణీ


సప్తగిరికాలనీ పంచాయతీలో పింఛను కోసం వేచి ఉన్న వృద్ధులు

మంగళం, ఏప్రిల్ 3: ఒకవైపు మండే ఎండలు.. మరోవైపు వృద్ధాప్యం కళ్లు సరిగా కనిపించకపోయినా కాళ్లు ముందుకు కదలడానికి అంగీకరించకపోయినా క్షణం ఆల్యం అయినా పింఛను చేతికి అందదేమోనన్న భయం వెరసి ఉదయం నుంచి వృద్ధులు సచివాలయాల వద్ద పింఛను డబ్బుల కోసం మండుటెండలో వేచి ఉండటం చూపరులను కదిలించింది. మహిళలైతే కొంగు నెత్తిపై వేసుకుని జారిపోతున్న కళ్లద్దాలను సర్దుకుంటూ పింఛను కాగితాలున్నాయా లేవో అని ఒకటికి రెండుసార్లు సరిచూసుకుంటూ సచివాలయ సిబ్బంది ఎపుడు లోపలకు పిలుస్తారా అని బయటే కూర్చుని ఎదురుచూశారు. మధ్యాహ్నం ఒంటిగంట దాటుతున్నా సచివాలయ సిబ్బంది పిలవకపోవడంతో అసలు ఏం జరిగిందని కొందరు అక్కడ సిబ్బందిని నిలదీయగా డబ్బు కోసం బ్యాంకు వెళ్లారని, తెచ్చిన వెంటనే ఇస్తామని చెప్పడంతో పింఛను డబ్బు వచ్చేంత వరకు వెళ్లేదిలేదంటూ వృద్ధులు, దివ్యాంగులు అక్కడే వేచి ఉన్నారు. కొంతమంది తమకుటుంబసభ్యుల ద్వారా భోజనాలు అక్కడికే తెప్పించుకుని తిన్నారు. ఎట్టకేలకు 3గంటల ప్రాంతంలో సచివాలయ సిబ్బంది బ్యాంకు నుంచి డబ్బు తేవడంతో పింఛను పంపిణీ చేశారు. మంగళం, రణధీరపురం, తిరుమలనగర్, సప్తగిరికాలనీ, శెట్టిపల్లి, తిమ్మినాయుడు పంచాయతీల్లో బుధవారం నాటి పరిస్థితి ఇది. కొసమెరుపు ఏమిటంటే ఈ నెల అయితే గడిచింది. మే నెలలో అయినా ముందుగానే డబ్బులు తెచ్చిపెట్టుకుని పింఛన్లు ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వృద్ధులు కో రుతున్నారు.


తిరుమలనగర్ పంచాయతీలో పింఛను కోసం వేచిఉన్న వృద్ధులు

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 3 : చంద్రగిరి, సూళ్లూరుపేటలో పనిచేస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో మంగళవారం జరిగిన ఒక ఘటనలో నిందితులు నవీన్, బుల్లెట్ బాల, జయప్రకాష్ కలసి తన విధులకు ఆటంకం కలిగించారని అదే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. వీరి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అయితే నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించే క్రమంలో హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తమ నాయుడు జయప్రకాష్ పట్ల దురుసుగా ప్రవర్తించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయంపై ఎస్పీ సమగ్ర విచారణకు ఆదేశించారు. నివేదిక ఆధారంగా పురుషోత్తమనాయుడును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో సూళ్లూరుపేట స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ బీవీఎస్ గోపీని సస్పెండ్ చేశారు. ఆయన ఒక రాజకీయ పార్టీకి చెందిన వాట్సాప్ గ్రూపులో మెంబరుగా చేరి ఒక నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడంతో సస్పెండ్ చేసినట్లు ఎస్పీ చెప్పారు.

ఆర్టీసీ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 3: ఎన్నికల ప్రచారం చేస్తున్నారని తిరుపతి డిపో గ్యారేజీ అసిస్టెంట్ మేనేజర్(స్టోర్స్), ది పీటీడీ వైఎస్సార్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. గత ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ డిపోలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారని వార్తలు వెలువడిన విషయం విదితమే. దీనిపై ఈసీ విచారణకు ఆదేశించింది. నిజమేనని రుజువుకావడంతో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నరసింహులు స్పందించి, చంద్రయ్యను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సిలబస్ మార్పు చేర్పులపై సుదీర్ఘ చర్చ

● హాజరైన బీఓఎస్ చైర్మన్లు, అకడమిక్ అధికారులు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 3: యూనివర్సిటీల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాల్సిన సిలబస్‌కు సంబంధించిన మార్పుచేర్పులపై పద్మావతి యూనివర్సిటీలో సమావేశం నిర్వహించారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ - యోగి వేమన యూనివర్సిటీకి చెందిన బీఓఎస్ చైర్మన్లు, అకడమిక్ అఫైర్స్ అధికారులు పాల్గొని సిలబస్‌లో చేపట్టవలసిన మార్పు చేర్పులపై సుదీర్ఘంగా చర్చించారు. నిగ్గుదేల్చిన సిలబస్ వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి నివేదిక రూపంలో అందించనున్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, అధ్యాపకులు పాల్గొన్నారు.

వలంటీర్ల చేత చీరల పంపిణీ

రేణిగుంట, ఏప్రిల్ 3 : వారం రోజులుగా వలంటీర్లు చీరలు పంపిణీ చేస్తున్నారు.రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని 11గ్రామాల్లో ఈ చీరల పంపిణీ జరుగుతోంది.ఎమ్మెల్యే ఇవ్వమన్నారని చెప్పి వలంటీర్లు చీరలు అందజేస్తున్నారు.స్థానిక ప్రజాప్రతినిధి వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి ఈ పనికి వినియోగించుకున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఆదాయ పన్ను వసూళ్లలో తిరుపతి ముందంజ


దుర్గా సంరోధ్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్3 : రాష్ట్రం విడిపోయాక ఆదాయ పన్ను వసూళ్లలో విజయవాడ, విశాఖపట్నం కంటే తిరుపతి కమిషనరేట్ 42 శాతం వృద్ధి సాధించిందని తిరుపతి ఆదాయ పన్ను శాఖ కమిషనర్ దుర్గా సంరోధ్ చెప్పారు. తిరుపతిలో బుధవారం ఆయన మాట్లాడుతూ పన్ను చెల్లింపుదారుల సహకారం తో గత ఏడాది రూ.965 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది రూ.1360 కోట్లు వసూలు చేసి మొదటి స్థానంలో నిలబెట్టామని తెలిపారు. చెల్లింపుదారులు స్వచ్ఛందంగా వచ్చి చెల్లించడం శుభపరిణామమని అన్నారు. వచ్చే ఏడాది కూడా ముందు వరుసలో నిలిచేలా కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కమిషనర్ వంశీధర్ పాల్గొన్నారు.

రేపు డయల్ యువర్ టీటీడీ ఈవో

తిరుమల, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): డయల్ యువర్ టీటీడీ ఈవో కార్యక్రమం శుక్రవారం జరగనుంది. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనం మీటింగ్ హాల్‌లో ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. భక్తులు తమ సందేహాలు, సూచనలు, ఫిర్యాదులపై టీటీడీ ఈవో ధర్మారెడ్డితో నేరుగా మాట్లాడవచ్చు. దీనికోసం భక్తులు 0877 2263261ను సంప్రదించాల్సి ఉంటుంది.

శ్రీచైతన్యలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



తిరుపతి(విద్య), ఏప్రిల్ 3: జీఎస్ మాడవీధిలోని శ్రీచైతన్య స్కూల్‌లో బుధవారం గ్రాడ్యుయేషన్‌డేని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కాన్వొకేషన్ దుస్తులు ధరించి, సర్టిఫికెట్లు అందుకున్నారు. ఏజీఎం జి.సురేష్ మాట్లాడుతూ పాఠశాల దశ నుంచి విద్యార్థులు చదువుపై ఆసక్తి పెంచుకోవడం వల్ల జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ జి.స్వర్ణకుమారి, ప్రిన్సిపాల్ జయప్రకాశ్, వైస్ ప్రిన్సిపాల్ కిశోర్‌బాబు, డీన్ సురేష్, ప్రైమరీ ఇన్‌చార్జి దీప, జోనల్ ప్రైమరీ కోఆర్డినేటర్ సరస్వతి పాల్గొన్నారు.

తెలుగు సంవత్సరాది క్యాలెండరు ఆవిష్కరణ

తిరుపతి(విద్య), ఏప్రిల్ 3: ఉగాదిని పురస్కరించుకుని హిందూ ఉపాధ్యాయ సమితి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండరును బుధవారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా వచ్చిన హరేరామ భక్తులు రాధామనోహర్‌దాస్ ప్రభుతో సంఘ జాతీయ అధ్యక్షుడు మహేష్‌డేగల, శంకర్‌రెడ్డి, జీఎస్ ప్రసాద్ కలసి ఆవిష్కరించారు.

నవజీవన్‌కు వీల్‌చైర్ వితరణ



తిరుపతి(విద్య), ఏప్రిల్ 3: తిరుచానూరులోని నవజీవన్ బ్లైండ్ రిలీఫ్ కేంద్రానికి తిరుపతి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వీల్‌చైర్‌ను అందించినట్లు క్లబ్ అధ్యక్షుడు భీమినేని మునికృష్ణనాయుడు పేర్కొన్నారు. లయన్ ఎమ్మార్ చంద్రన్ సతీమణి నాగమణి జ్ఞాపకార్థం ఈ వీల్‌చైర్‌ని అందించామని తెలిపారు. కేంద్రం చైర్మన్ శ్రీధర్, క్లబ్ సెక్రటరీ ముబారక్‌బాషా, ట్రెజరర్ వినోద్ వెంకటాచలం, మేరీ, ప్రసాద్ పాల్గొన్నారు.

'సూపర్' వైద్య పరికరాలెక్కడ?




క్యాన్సర్ చికిత్సా కేంద్రంలో అందుబాటులో లేని వైద్యులు - ప్లాస్టిక్ సర్జరీ కేంద్రంలో కానరాని వైద్యులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 3 : రుయాస్పత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని అధికారులు హడావుడి చేశారు. 10 మంది వైద్యులను ప్రభుత్వం నియమించి, ఓపీ సేవలు అందించేందుకు అవసరమైన గదులను ఏర్పాటు చేసి గత నెల 6న ఈ సేవలను ప్రారంభించారు. అయితే దానికి తగిన వైద్య పరికరాలను మాత్రం సమకూర్చలేదు. ప్రధానంగా కార్డియాక్ ఓపీ సేవలను 20 ఏళ్ల తర్వాత అందుబాటులోకి తీసుకువచ్చారు. కానీ ఇందుకు అవసరమైన వైద్య పరికరాల్లో ఏ ఒక్కటీ అందించిన దాఖలాలు లేవు. ప్రధానంగా గుండె సమస్యను తెలుసుకునేందుకు మొదట చేసే టీఎంటీ(ట్రెడ్ మిల్ టెస్ట్)కి, స్టంట్ వేసేందుకు అవసరమైన పరికరాలను ఏర్పాటు చేయలేదు. కార్డియాలజీ సేవలు అందించాలంటే ప్రధానంగా క్యాత్‌ల్యాబ్ అవసరం, సీసీయూ(కార్డియాక్ కేర్ యూనిట్) ప్రధానం. ఇవేమీ లేకనే కేవలం ఇక కార్డియాలజిస్టును నియమించి చేతులు దులుపుకున్నారు. ఆయన స్విమ్స్‌తో ఎంవోయూ కుదుర్చుకొని గుండె సమస్యలతో వచ్చే వారిని స్విమ్స్‌కు, ఇతర ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. అలాగే నెఫ్రాలజీ సేవలు అందించేందుకు ఇద్దరు నిపుణులను నియమించినా అవసరమైన డయాలసిస్ యంత్రాలు, ఇతర పరికరాలు లేక వారు కూడా ఆస్పత్రి ఆవరణలోని ప్రైవేటు నెఫ్రో ప్లస్‌కు రెఫరల్ చేయాల్సి వస్తోంది. ఇక క్యాన్సర్ చికిత్స అందించే ఆంకాలజీ, రేడియోథెరపీ కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. వారంలో ఒక్కోరోజు ఒక్కో విభాగం పరిధిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందిస్తామని అధికారులు చేసిన హడావుడి కేవలం ప్రకటనలకే పరిమితమైందన్న విమర్శలున్నాయి. రుయాలో సాధారణ వైద్య సేవలే గగనంగా ఉన్న పరిస్థితుల్లో సూపర్ స్పెషాలిటీ అని చెప్పడం విడ్డూరంగా ఉందని రోగులు పేర్కొంటున్నారు.

టీడీఆర్ బాండ్లలో అవినీతిపై విచారణ జరిపిస్తాం

- టీటీడీ నిధులను దారి మళ్లించారు - కమీషన్ల డబ్బుతో గెలవాలని చూస్తున్నారు
- టీడీపీ కూటమి అభ్యర్థులు, నాయకుల విమర్శ



ఐక్యత చాటుతున్న కూటమి అభ్యర్థులు, నాయకులు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 3 : మాస్టర్‌ప్లాన్ రోడ్లకు సంబంధించి టీడీఆర్ బాండ్లలో ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, ఆయన తనయుడు, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి అంతులేని అవినీతికి పాల్పడ్డారని, దీనిపై తాము అధికారంలోకి రాగానే విచారణ జరిపిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం సామవాయి రోడ్డులోని రామతులసి కల్యాణ మండపంలో మూడు పార్టీల నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఆరణి మాట్లాడుతూ తిరుపతిలో భూమన చేసిన అభివృద్ధి కేవలం దొంగ ఓట్లు చేర్పడమేనని ఎద్దేవా చేశారు. తనకు అవకాశమిస్తే గతంలో ఎప్పుడూ జరగని అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. దళితుడిని చంపి డోర్ డెలివరి చేసిన పార్టీ వైసీపీ అంటూ విమర్శించారు. ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ మాట్లాడుతూ చిరంజీవి సామాజిక న్యాయం పిలుపుతో ఐఏఎస్ పోస్టుకు రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని, పవన్‌కల్యాణ్ తనను ఎంతగానో ఆదరించారని అన్నారు. సీఎం జగన్‌కు ఇంగితజ్ఞానం లేదని, ఎంపీ నుంచి ఎమ్మెల్యేగా పంపారని, చివరికి అది కూడా లేకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భూమన అవినీతిపై విచారణ జరిపిస్తానని, పుణ్యక్షేత్రంలో దౌర్జన్యాలు, రౌడీయిజం అంతం కావాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్ రోడ్లలో అవినీతి జరిగిందని, కూటమి అభ్యర్థులను గెలిపించుని కుటుంబ పాలనను తరిమికొడుదామని కోరారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కరుణాకరరెడ్డి రూ.1,500 కోట్ల టీటీడీ నిధులను దారి మళ్లించారని, అందులో కమీషన్ పేరిట రూ.200కోట్లు నొక్కేశారని, ఆ డబ్బుతోనే ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇంకా కొందరు అధికారులు వైసీపీకి కొమ్ము కాస్తున్నారని, వారు కూడా ఇబ్బందులకు గురికావడం తప్పదని అన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ మాట్లాడుతూ స్థానిక ఎన్నికల తరహాలోనే ఈ ఎన్నికల్లో వైసీపీ గెలవాలని చూస్తోందని, అది జరగని పని అన్నారు. కాగా, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, టీడీపీ సీనియర్ నేత ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ హాజరుకాకపోవడం చర్చనీయాంశమైంది.

గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సాహించాలి



సయ్యద్‌సాహెబ్‌కు సభ్యత్వ రసీదు అందజేస్తున్న రజనీ

తిరుపతి (క్రీడలు), ఏప్రిల్ 3: గ్రామీణ స్థాయిలోనే క్రీడలను ప్రోత్సహించాలని ప్రముఖ హాకీ క్రీడాకారిణి ఈ.రజని సూచించారు. బుధవారం శ్రీనివాస క్రీడా సముదాయంలో క్రీడా భారతి-ఆంధ్రప్రదేశ్ వార్షిక సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. యువతను క్రీడలలో ప్రోత్సహించి 2036లో భారత్‌లో జరిగే ఒలంపిక్స్‌లో ఏపీ క్రీడాకారులు ఎక్కువ మెడల్స్ సాధించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాను కూడా గ్రామీణ స్థాయి నుంచి ఒలంపిక్స్ వరకు వెళ్లడం గర్వంగా ఉందన్నారు. తొలి రోజే వందమంది సభ్యత్వం తీసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్, క్రీడాభారతి రాష్ట్ర కార్యదర్శి ధనంజయరెడ్డి, సంయుక్త కార్యదర్శి సురేంద్రరెడ్డి, మునికృష్ణయ్య, మునిబాబు, మారుతి, జయరాం, షణ్ముగంరెడ్డి, కిరణ్, మురళి, శ్రీను, సాయిసుమతి, గోపి పాల్గొన్నారు.

లాక్రోస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రతిభ



ట్రోఫీ అందజేస్తున్న రజని

తిరుపతి(క్రీడలు), ఏప్రిల్ 3: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో గత వారం జరిగిన లాక్రోస్ ఫస్ట్ నేషనల్ సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల ఛాంపియన్‌షిప్ పోటీల్లో ఏపీ జట్లు ప్రతిభ కనబరిచాయి. ద్వితీయ స్థానం దక్కించుకున్న ఇరు జట్లను బుధవారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయంలో సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన హాకీ క్రీడాకారిణి రజని చేతుల మీదుగా ట్రోఫీ, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ లాక్రోస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ మునికృష్ణ, కోచ్ హరి, జిల్లా క్రీడాకాధికారి సయ్యద్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ రెసిడెంట్ డాక్టర్‌పై చర్యలకు ఫిర్యాదు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 3 : విధులు సక్రమంగా నిర్వహించాలని చెప్పిన తనను దూషించడంతోపాటు వివాదానికి పాల్పడిన సీనియర్ రెసిడెంట్ డాక్టర్ నిస్సార్‌పై సీఎస్‌ఆర్ఎంవో డాక్టర్ లక్ష్మానాయక్ బుధవారం ఫిర్యాదు చేశారు. రుయాస్పత్రిలోని అత్యవసర విభాగంలో డాక్టర్లు అందుబాటులో ఉండటం లేదని, రోగులను పట్టించుకోవడంలేదనే ఫిర్యాదులు వస్తుండటంతో గత నెల 31 రాత్రి సీఎస్‌ఆర్ఎంవో తనిఖీ చేసి, హెచ్‌వోడీలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, హౌస్ సర్జన్లు, పీజీ డాక్టర్లు లేకపోవడాన్ని గుర్తించారు. అదే సమయంలో వారి విధులను సీనియర్ రెసిడెంట్ డాక్టరు చేస్తుండటాన్ని గుర్తించారు. 'మీరు ఎందుకు ఇక్కడ ఉన్నారని' సీనియర్ రెసిడెంట్ డాక్టర్ నిస్సార్‌ను అడగ్గా 'మీరెవరు నన్ను అడిగేందుకు.. నా ఇష్టం' అంటూ దురుసుగా సమాధానం చెప్పడంతోపాటు వివాదానికి దిగాడు. ఈ విషయాన్ని ఆయన సూపరింటెండెంట్ దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో బుధవారం కలెక్టర్‌కు, డీఎంఈకి ఫిర్యాదు చేశారు.

రుయాలో అనధికార డ్రైవర్ తొలగింపు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 3 : రుయాస్పత్రిలో మూడేళ్లకు పైగా అనధికారికంగా అంబులెన్సులను, అధికారుల వాహనాలను నడుపుతున్న డ్రైవర్ సుధీర్‌ను ఎట్టకేలకు విధుల నుంచి తొలగించారు. మూడేళ్ల కిందట సూపరింటెండెంట్‌గా ఉన్న అధికారి ఓ ప్రైవేటు వ్యక్తిని తన వాహనానికి డ్రైవర్‌గా నియమించుకున్నారు. ఆపై ఆ అధికారి ఉద్యోగ విరమణ చేసినా ఆ డ్రైవర్‌ను తొలగించలేదు. అనధికారికంగా కొనసాగిస్తూ నెలకు రూ.20 వేలు జీతం ఇస్తూ అంబులెన్సులను, అధికారుల వాహనాలను నడిపేందుకు వినియోగించుకుంటున్నారు. దీనిపై విమర్శలు రావడంతో అతన్ని విధుల నుంచి తొలగించి చేతులు దులుపుకున్నారు. అయితే అతనికి ఇన్ని రోజులు జీతం ఏ గ్రాంటు నుంచి ఇచ్చారనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఎట్టకేలకు గుంతను పూడ్చారు



మంగళం, ఏప్రిల్ 3: మంగళం ఆర్టీవో కార్యాలయం పక్కన బీటీఆర్ కాలనీకి వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న గుంతను ఎట్టకేలకు అధికారులు పూడ్చారు. గుంత పూడ్చకపోవడంపై గత నెల 28వ తేదీన నడిరోడ్డుపై పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు దానిపై సిమెంటు పలకను ఏర్పాటు చేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.04 కోట్లు

తిరుమల, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.4.04 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 56,228 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,886 మంది తలనీలాలు సమర్పించారు.

కోదండరామాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



తిరుపతి(కల్చరల్) ఏప్రిల్ 3: కోదండరామస్వామి ఆలయంలో బుధవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 5నుంచి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఆలయ శుద్ధి కార్యక్రమం చేపట్టారు. ఉదయం స్వామివారికి సుప్రభాతం, తోమాలసేవ,సహస్రనామార్చన నిర్వహించారు. 6.30నుంచి 9 గంటల వరకు సుగంధ ద్రవ్యాలతో ఆలయాన్ని శుద్ధిచేశారు. హైదరాబాదుకు చెందిన భక్తురాలు ప్రసన్న రెడ్డి, తిరుపతికి చెందిన మణి ఆలయానికి కొత్త పరదాలు, కురాళాలు అందించారు. ఆలయ డిప్యూటి ఈవో నాగరత్న, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ప్రధాన అర్చకులు ఆనందకుమార్ దీక్షితులు పాల్గొన్నారు.

నేడు అంకురార్పణ

కోదండరామాలయ బ్రహ్మోత్సవాలకు గురువారం రాత్రి 7నుంచి 8.30 మధ్య అంకురార్పణ జరగనుంది. సేనాపతి ఉత్సవం, మేదిని పూజ, మృత్సంగ్రహణం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

ఖజానా ఖాళీ చేసి... పింఛన్ల డబ్బుతో చెలగాటం



మీడియా సమావేశంలో తెలుగు యువత నేతలు

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 3: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఖజానాను ఖాళీ చేసి, పింఛను డబ్బుతో చెలగాటమాడుతున్నారని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు విమర్శించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ వైసీపీ నేతలు పింఛను డ్రామా ఆడుతూ చంద్రబాబుపై అబద్ధపు ప్రచారం చేస్తున్నారన్నారు. వృద్ధులకు ఇంటి వద్దకే పింఛన్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైందని, తద్వారా వృద్ధులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల వైసీపీ నాయకులు దగ్గరుండి వృద్ధులను మోసుకుని వచ్చి కపట నాటకాలు ఆడుతూ పింఛన్లు ఇప్పించారన్నారు. అవ్వాతాతలు అధైర్యపడాల్సిన అవసరం లేదని, టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛను రాని వారికి మూడు నెలలకు కలిపి ఒకేసారి అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. తెలుగు యువత నేత కంకణాల రజనీకాంత్‌నాయుడు మాట్లాడుతూ సిద్ధం సభలకు కాంట్రాక్టర్లకు డబ్బులు చెల్లించేందుకు ఖజానాను ఖాళీ చేశారని ఆరోపించారు. అయితే చంద్రబాబు పింఛన్లను అడ్డుకుంటున్నారని అబద్ధపు ప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో తెలుగు యువత నేతలు తోట వాసుదేవ్, రాష్ట్ర కార్యదర్శి ఆర్‌పీ శ్రీనివాసులు, కరణం సందీప్, శ్రీనివాస్‌యాదవ్, రఫీ, రంజిత్‌నాయుడు, శ్రీరాంబాబీ, గోపి, లోకేష్‌రాయల్, దిలీప్ రాయల్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలకు మించిన ఔషధం లేదు

- ప్రసూతి ఆస్పత్రిలో తల్లిపాల నిధి ప్రారంభం



పోస్టర్లు విడుదల చేస్తున్న అధికారులు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 3 : పిల్లలకు తల్లిపాలకు మించిన దివ్య ఔషధం లేదని ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పార్థసారథిరెడ్డి, డీఎంహెచ్‌వో శ్రీహరి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో రోటరీ క్లబ్ వారు రూ.35 లక్షలతో ఏర్పాటు చేసిన తల్లిపాల నిధి(హ్యూమన్ మిల్క్) కేంద్రాన్ని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖరన్, రోటరీ క్లబ్ నిర్వాహకులతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. తల్లిగా తమ బిడ్డలతోపాటు మరొక బిడ్డకు పాలు పట్టించే అవకాశం లభించడం అదృష్టమన్నారు. చాలామంది పిల్లలు తల్లిపాలకు దూరమై రోగాల బారినపడుతున్నారని, అలాంటి వారిని ఆదుకునేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. పాలు దానం చేయడం వల్ల రొమ్ము సంబంధిత క్యాన్సర్లు, ఇతర వ్యాధులు రావన్నారు. అనంతరం తల్లిపాలు ముద్దు.. డబ్బా పాలు వద్దు అని నినాదాలు చేస్తూ దానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రుయాస్పత్రి సూపరింటెండెంట్ రవిప్రభు, శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వీసీ భారతి, ఎన్ఎంసీ సభ్యులు డాక్టర్ సంతోష్ కుమార్, సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ కృష్ణప్రశాంతి, స్విమ్స్ మాజీ డైరెక్టర్ వెంగమ్మ, సీనియర్ చిన్నపిల్లల వైద్య నిపుణులు సరితా చౌదరి, రత్నమాలిక, కిరీటి, మనోహర్, హెచ్‌వోడీ ప్రమీల, రోటరీ క్లబ్ సభ్యులు దామోదరం, రవికుమార్ పాల్గొన్నారు.

110 మందిపై రౌడీషీట్లు, కేసులు : డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 3 : తిరుపతిలో రౌడీలు, అల్లరిమూకలు, సంఘ విద్రోహక శక్తులకు తావులేదని, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అలాంటి 110 మందిపై రౌడీషీట్లతోపాటు కేసులు నమోదు చేశామని డీఎస్పీ సురేందర్ రెడ్డి తెలిపారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లలో ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గత ఎన్నికల్లో గలాటాలు, ఘర్షణలకు పాల్పడిన 279 మందిని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. పాత నేరస్థులను, అనుమానాస్పదులను అదుపులోకి తీసుకుని సొంత పూచీకత్తుపై విడిచి పెట్టామని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, విక్రయించడం చేసిన 21 మందిపై కేసు నమోదు చేశామన్నారు. రూ.3.39 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.

పింఛను డబ్బు ఇళ్ల వద్దకే వెళ్లి ఇవ్వాలి

టీడీపీ నేత నరసింహయాదవ్



పింఛను డబ్బుపై ఆరా తీస్తున్న నరసింహయాదవ్

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 3: వికలాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను డబ్బులు అందించాలని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ అన్నారు. బుధవారం జీవకోన పరిధిలోని 46, 48, 49, 50 డివిజన్లలో పింఛను పంపిణీపై సచివాలయాలను సందర్శించిన ఆయన అవ్వాతాతలతో పింఛను డబ్బుపై ఆరా తీశారు. సచివాయాల వద్దకు వచ్చి నిరాశగా తిరిగి వెళ్లిపోతున్న పింఛనుదారులకు ధైర్యం చెప్పారు. ఎందుకు పింఛను డబ్బులు సకాలంలో అందించలేపోతున్నారని సచివాలయ అధికారులను అడిగారు. డబ్బు రాకపోవడం వల్లే ఆలస్యమవుతోందని వారు సమాధానమిచ్చారు. నరసింహ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాలను సైతం పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వృద్ధులకు పింఛను పంపిణీ విషయంలో సీఎం జగన్ మొండిచేయి చూపాడని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు, టీడీపీ నగర ప్రధాన కార్యదర్శి మహేష్‌యాదవ్, నాయకులు చేజర్ల మనోహరాచారి, 46వ డివిజన్ యూనిట్ ఇన్‌చార్జి శ్రీనివాసయాదవ్, బూత్ కన్వీనర్లు వెంకటేష్‌రెడ్డి, బీఎస్ లో కేష్, భానుచంద్ర, ఈశ్వర్ పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘనపై వివరణ కోరిన ఎన్నికల అధికారి

తిరుపతి రూరల్, ఏప్రిల్ 3 : జాతీయ సంస్కృతవర్సిటీ ఆదివారం సాయంత్రం నిర్వహించిన ల్యాప్‌టాప్‌ల పంపిణీ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ పాల్గొనడంపై ఎన్నికల అధికారి వివరణ కోరినట్లు తెలిసింది. ఈ విషయంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో ఇది కోడ్ ఉల్లంఘన కాదా? అన్న శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. వ్యక్తిగత పని విషయమై వర్సిటీకి వచ్చిన శంకర్‌నాయక్ అనుకోకుండా వేదికపైకి వచ్చారని, ఇందులో వర్సిటీ ప్రమేయం లేదని రిజిస్ట్రార్ ఆర్‌జే రమాశ్రీ వివరణ ఇచ్చినట్లు సమాచారం.

వేసవి సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 3: రాష్ట్రంలోని జూనియర్ కళాశాలలకు గత నెల 31నుంచి మే 31వ తేదీ వరకు ఇంటర్ బోర్డు వేసవి సెలవులు ప్రకటించిందని, ఆ సమయంలో తరగతులు నిర్వహించొద్దని ఆర్ఐవో జీవీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జూన్ 1న కళాశాలలను పునఃప్రారంభించాలని తెలిపారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో వివిధ రకాల శిక్షణ పేరిట ఇంటర్ తరగతులు నిర్వహిస్తున్నారని తమకు ఫిర్యాదులు అందాయని, అలాంటి వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇదేం వేడి గోవిందా..!

తిరుమలలో పెరిగిన ఉష్ణోగ్రతలు - తీవ్ర ఎండలో యాత్రికుల అగచాట్లు



కొళాయి కింద తల తడుపుతున్న యాత్రికుడు



ఆలయం ముందు నీరు తాగుతున్న పావురం



కాళ్లను నీటితో తడుపుకుంటున్న భక్తులు



గొడుగునీడలో వెళుతున్న భక్తులు



పుష్కరిణిలో చిన్నారుల కేరింతలు

తిరుమల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): నిత్యం చల్లటి వాతావరణంతో ఉండే తిరుమల కొండ ఈసారి సూర్యుడి వేడికి నిప్పులకొలిమిగా మారింది. భానుడు ప్రతాపంతో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వస్తున్న భక్తులు అగచాట్లు పడుతున్నారు. తిరుమలలోనూ ఇతర ప్రాంతాల తరహాలో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా నమోదవుతోంది. బుధవారం 36 డిగ్రీలు నమోదైంది. గతంలో 30 డిగ్రీలంటేనే చాలా ఎక్కువ. ఉదయం 7 గంటల నుంచే ఎండ మొదలవుతోంది. 11 నుంచి సాయంత్రం 6 గంటలైనా ఎండ ప్రభావం తగ్గడం లేదు. సాధారణంగా మాడవీధులు, ఆలయ పరిసర ప్రాంతాలు, లడ్డూ కౌంటర్ వంటి ప్రాంతాల్లో పాదరక్షలతో తిరగకూడదు. కాలుతున్న నేలపై నడవలేక భక్తులు పరుగులు తీస్తున్నారు. చిన్నారులైతే ఏడుస్తూ కనిపిస్తున్నారు. మరికొందరు లడ్డూలకు వినియోగించే కవర్లు, అట్టముక్కలు కాళ్లకు కట్టుకుని వెళుతున్నారు. ఎండవేడికి పుష్కరిణిలో స్నానాలు చేసేవారి సంఖ్య కూడా పెరిగింది. మరోవైపు టీటీడీ ఎప్పటికప్పుడు నీటి ట్యాంకర్లతో నేలభాగాన్ని తడుపుతోంది. కొన్ని చోట్ల కూల్ పెయింట్ వేస్తోంది.

ఒక్క ఛాన్స్‌తో సర్వనాశనం: పాశిం


టీడీపీలో చేరినవారితో మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిల్లకూరు, ఏప్రిల్ 3: ఒక్కఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని బూదనం, ఓడూరు, పున్నపువారిపాళెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దోచుకోవడమే పనిగా పాలన సాగించిందన్నారు. ఒకటో తేదీన అందించాల్సిన పింఛన్లను రెండురోజుల ఆలస్యంగా పంపిణీ చేయడమే కాకుండా టీడీపీపై బురదచల్లడం తగదన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పింఛను రూ.4వేలకు పెంచడంతో పాటు ఇంటివద్దే అందిస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవాలని సునీల్‌కుమార్ కోరారు. ఈ సందర్భంగా పలువురు టీడీపీలో చేరడంతో వారికి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, గుండాల లీలావతి, శ్రీనివాసులు, మునిశేఖర్‌గౌడ్, చెంచుకృష్ణయ్య, వెంకటేశ్వర్లునాయుడు, కుమార్‌యాదవ్, మస్తాన్, కీరవాణి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీవి శవ రాజకీయాలు: కురుగొండ్ల

వెంకటగిరి, ఏప్రిల్ 3: వైసీపీ నేతలు శవ రాజకీయాలు చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం పట్టణంలోని 23 వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తన కుమార్తె సాయిప్రియను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం మీడియాతో మట్లాడుతూ గత ఎన్నికల్లో జగన్ తన చిన్నాన్న హత్యను ఆజకీయాలకు వాడుకున్నారని విమర్శించారు. స్థానిక బంగారుపేటలో ఓ వృద్ధుడు సహజ మరణం చెందితే వైసీపీ నేతలు గుండెపోటుగా చిత్రీకరించి టీడీపీపై అభాండాలు వేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు. పింఛన్ల సొమ్మును కాంట్రాక్టర్లకు దోచి పెట్టి అవ్వా తాతలను మోసం చేసిన జగన్‌ను ప్రజలు ఛీకొడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పులికొల్లు రాజేశ్వరరావు, కేవీకే ప్రసాద్‌నాయుడు, ఫునుగోటి విశ్వనాథ నాయుడు, మల్లారం బాబు, అవ్వారు సత్యనారాయణ, మంకు ఆనంద్, హేమంత్ చౌదరి, నాని, చంటి పాల్గొన్నారు.

ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 3: చంద్రగిరి, సూళ్లూరుపేటలో పనిచేస్తున్న ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రగిరి పోలీసు స్టేషన్‌లో మంగళవారం జరిగిన ఒక ఘటనలో నిందితులు నవీన్, బుల్లెట్ బాల, జయప్రకాష్ కలసి తన విధులకు ఆటంకం కలిగించారని అదే స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజశేఖర్ ఫిర్యాదు చేశారు. వీరి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. అయితే నిందితులను పోలీసుస్టేషన్‌కు తరలించే క్రమంలో హెడ్ కానిస్టేబుల్ పురుషోత్తమ నాయుడు జయప్రకాష్ పట్ల దురుసుగా ప్రవర్తించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ విషయంపై ఎస్పీ సమగ్ర విచారణకు ఆదేశించారు. నివేదిక ఆధారంగా పురుషోత్తమ నాయుడును సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా, ఎన్నికల కోడ్ ఉల్లంఘించడంతో సూళ్లూరుపేట స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ బీవీఎస్ గోపీని సస్పెండ్ చేశారు. ఆయన ఒక రాజకీయ పార్టీకి చెందిన వాట్సాప్ గ్రూపులో మెంబరుగా చేరి ఒక నాయకుడికి జన్మదిన శుభాకాంక్షలు చెప్పడంతో సస్పెండ్ చేసినట్లు ఎస్పీ చెప్పారు.

సిలబస్ మార్పు చేర్పులపై సుదీర్ఘ చర్చ

హాజరైన బీఓఎస్ ఛైర్మన్లు, అకడమిక్ అధికారులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 3: యూనివర్సిటీల్లో వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాల్సిన సిలబస్‌కు సంబంధించిన మార్పుచేర్పులపై పద్మావతి వర్సిటీలో సమావేశం నిర్వహించారు. పద్మావతి మహిళా వర్సిటీ - యోగివేమన వర్సిటీకి చెందిన బీఓఎస్ ఛైర్మన్లు, అకడమిక్ అఫైర్స్ అధికారులు పాల్గొని సిలబస్‌లో చేపట్టవలసిన మార్పుచేర్పులపై సుదీర్ఘంగా చర్చించారు. నిగ్గుదేల్చిన సిలబస్ వివరాలను రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి నివేదిక రూపంలో అందించనున్నారు. ఈ కార్యక్రమంలో పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని, అధ్యాపకులు పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

కారు ఢీకొని తమిళనాడువాసి మృతి

తడ, ఏప్రిల్ 3: కారు ఢీకొని తమిళనాడువాసి మృతి చెందాడు. ఈ ఘటన తడ మండలంలోని రామాపురం జాతీయ రహదారి వద్ద మంగళవారం రాత్రి జరిగింది. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు జిల్లా పొదువాళ్లూరు గ్రామానికి చెందిన ఎం.వెంకటేషన్ బేల్దారి పని చేస్తుంటాడు. మంగళవారం గుమ్మిడిపూడికి వచ్చి తన స్నేహితుడితో కలిసి తడ మండలం రామాపురం పంచాయతీ వెంకటాద్రిపాళెంలో ఉన్న బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో తిరిగి గుమ్మిడిపూడికి బయలుదేరాడు. మార్గమధ్యంలో రామాపురం జాతీయ రహదారి వద్ద రోడ్డు దాటుతుండగా చెన్నై నుంచి నెల్లూరు వెళ్లే కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేషన్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటిగుంటలో పడి మహిళ మృతి

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 3: మండలంలోని మిట్టపాళెం గ్రామ సమీపాన నీటిగుంటలో పడి మీరమ్మ(49) మృతి చెందినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం బర్రెలు మేపేందుకు మీరమ్మ పొలాల్లోకి వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో ఆమె భర్త, గ్రామస్థులు పొలాల్లో గాలింపు చేపట్టారు. మంగళవారం అర్ధరాత్రి నీటిగుంటలో మీరమ్మ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

కోట, ఏప్రిల్ 3: కోట పట్టణ పరిధిలోని తిన్నెలపూడికి వెళ్లే రోడ్డు వద్ద బుధవారం రాత్రి ఒక కారు డివైడర్‌ను ఢీకొంది. గూడూరు నుంచి ముగ్గురు యువకులు కారులో తూపిలిపాళెం బీచ్‌కు వెళ్లి తిరిగి వస్తూ తిన్నెలపూడికి వెళ్లే రోడ్డు వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం నుజ్జునుజ్జుకాగా, అందులో ఉన్న ముగ్గురు యువకులకు స్వల్పగాయాలయ్యాయి.


యార, గురునాథస్వామి, అంకమ్మల గ్రామోత్సవం - ముత్యాలమ్మ ఆలయం ఎదుట త్రిశూలం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ముత్యాలమ్మా... కరుణించు తల్లీ

- కొలువైన పోలేరమ్మ
- జనసందోహంగా కనుపూరు


కొలువైన పోలేరమ్మ - వేయికండ్ల కుండలతో భక్తుల ప్రదక్షణలు

చిల్లకూరు, ఏప్రిల్ 3: కోర్కెలు తీర్చే కల్పవల్లీ... కరుణించి కాపాడమ్మా అంటూ భక్తుల వేడుకోలుతో చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు బుధవారం మార్మోగింది. అమ్మవారి జాతరలో రెండో రోజు భక్తుల రద్దీ మరింత పెరిగింది. పోలేరమ్మ, ముత్యాలమ్మను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. జిల్లా నలుమూలలనుంచే కాకుండా ఇతర రాష్ట్రాలనుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. అమ్మవారు(ఆటలమ్మ) పోసిన భక్తులంతా మొక్కులు తీర్చుకునేందుకు రావడంతో కొంత రద్దీ నెలకొంది. నెత్తిమీద పెట్టుకున్న వేయి కండ్ల కుండ, అందులో గండ దీపం, మొలకు వేప చీర, పడిగళ్లు, నవధాన్యాలు, ఎర్రగడ్డలు, కోడిపిల్లలను గుడిపైకి విసిరి మొక్కులు తీర్చుకున్నారు. పోలేరమ్మను ఉదయం ఊరేగింపుగా తీసుకువచ్చి ముత్యాలమ్మ ఆలయానికి తూర్పు దిశలో ఏర్పాటు చేసిన తాత్కాలిక గుడిసెలో ప్రతిష్ఠించారు. పోలేరమ్మ మట్టి ప్రతిమతో పాటు సత్తి పోలేరమ్మ, అంకమ్మ, సిద్ధయ్య, పరుశురాముడు విగ్రహాలను ఊరేగించారు. సాయంత్రం యార, శ్రీగురునాథ స్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గొల్లల వేడుకల్లో భాగంగా గంగపెట్టె, వీరతాళ్లతో వీధుల్లో తిరిగారు. పెద్దగొల్ల చిందులు, గణాచారి నాట్యం సందడి చేశాయి. రాత్రి అమ్మవారికి పూలాంగి సేవ నిర్వహించారు. ఆలయ ఆవరణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ముత్యాలమ్మను కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి దర్శించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. మూడో రోజైన గురువారం భక్తుల సంఖ్య అధికంగా ఉండే అవకాశం ఉండడంతో అందుకు తగినట్లు ఏర్పాట్లు చేశామని ఈవో నవీన్ కుమార్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

స్నేహితుడి కోసం వెళ్లి...
హత్యకు గురైన యువకుడు

తిరుచానూరు, ఏప్రిల్ 3: సెల్‌ఫోన్ విషయమై జరిగిన గొడవలో స్నేహితుడి కోసం వెళ్లిన ఓ యువకుడు హత్యకు గురైన ఘటన తిరుపతి రూరల్ మండలం తనపల్లి హౌసింగ్ కాలనీలో తీవ్ర కలకలం రేపింది. తిరుచానూరు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలిలా.. తనపల్లి హౌసింగ్ కాలనీలో సింగారం అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. అతని వద్ద దుర్గాప్రసాద్ అలియాస్ నాని అనే యువకుడు సెల్‌ఫోన్ కుదవపెట్టాడు. డబ్బు చెల్లించి తన ఫోన్ ఇవ్వాలని మూడురోజులుగా సింగారం ఇంటికి వెళ్లినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో అది కాస్త గొడవకు దారితీసింది.ఈనేపథ్యంలో మంగళవారం రాత్రి సింగారం ఇంటికి వెళ్లిన దుర్గాప్రసాద్ డబ్బు క ట్టేసినా సెల్‌ఫోన్ ఎందుకు ఇవ్వలేదని గొడవపడటంతో సింగారం ఇంటి పక్కన ఉన్న పద్మావతి అనే మహిళ వారించింది. మాటామాటా పెరగడంతో ఆమెపై దుర్గాప్రసాద్ చేయిచేసుకున్నాడు. దీంతో పద్మావతి కుమారులు చరణ్, మణికంఠ కలిసి దుర్గాప్రసాద్‌పై దాడి చేయడంతో తనపై దాడి జరిగిందని.. వెంటనే రావాలని కుంట్రపాకంకు చెందిన తన స్నేహితుడు సునీల్‌కు దుర్గాప్రసాద్, ఫోన్ చేయడంతో దీంతో సునీల్ మరో కొంతమంది అక్కడికి చేరుకుని పద్మావతి కుటుంబంపైకి గొడవకు దిగారు. పద్మావతి కుమారులు సునీల్‌పై కత్తితో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అతడి స్నేహితులు వెంటనే ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా సునీల్ అలియాస్ సునీల్‌కుమార్‌రెడ్డి(23) మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం పోస్టుమార్టం అనంతరం సునీల్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. మణికంఠ, చరణ్ తదితరులపై హత్యకేసు నమోదు చేసినట్లు సీఐ చెప్పారు.

వలంటీర్ల చేత చీరల పంపిణీ

రేణిగుంట, ఏప్రిల్ 3: వారం రోజులుగా వలంటీర్లు చీరలు పంపిణీ చేస్తున్నారు.రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీ పరిధిలోని 11గ్రామాల్లో ఈ చీరల పంపిణీ జరుగుతోంది.ఎమ్మెల్యే ఇవ్వమన్నారని చెప్పి వలంటీర్లు చీరలు అందజేస్తున్నారు.స్థానిక ప్రజాప్రతినిధి వలంటీర్లపై ఒత్తిడి తెచ్చి ఈ పనికి వినియోగించుకున్నారన్న ఆరోపణలు విన్పిస్తున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగిపై సస్పెన్షన్ వేటు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 3: ఎన్నికల ప్రచారం చేస్తున్నారని తిరుపతి డిపో గ్యారేజీ అసిస్టెంట్ మేనేజర్(స్టోర్స్), ది పీటీడీ వైఎస్సార్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్యపై సస్పెన్షన్ వేటు పడింది. గత ఆదివారం వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్ డిపోలో ఎన్నికల ప్రచారం చేస్తున్నారని వార్తలు వెలువడిన విషయం విదితమే. దీనిపై ఈసీ విచారణకు ఆదేశించింది. నిజమేనని రుజువుకావడంతో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ నరసింహులు స్పందించి, చంద్రయ్యను సస్పెండ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రేపటినుంచి సంఘమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

కోట, ఏప్రిల్ 3: కోట మండలం గూడలిలో వెలసిన కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరుడి బ్రహ్మోత్సవాలు ఈనెల 5నుంచి 15వ తేదీ వరకు జరగనున్నాయి. 5న అంకుర్పాణ, గ్రామోత్సవం, 6న కొడి వస్త్రములు ధ్వజస్తంభానికి కట్టుట, ధ్వజారోహణం, 7న శేషవాహనసేవ, 8న హంస వాహనసేవ, 9న భృంగిసేవ, 10న రావణసేవ, 11న నందిసేవ, 12న రథోత్సవం, 13న ఉదయం స్వామివారి కల్యాణం, 14న విమానోత్సవం, 15న ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.04 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.04 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది.

జగన్ పర్యటన.. జనానికి కష్టాలు

నాయుడుపేట, ఏప్రిల్ 3: నాయుడుపేట - నరసారెడ్డికండ్రిగ అన్నమేడు క్రాస్ రోడ్డు మధ్యలో గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి జగన్ సభ జరగనుంది. తిరుపతి, శ్రీకాళహస్తి, చెన్నై, బెంగుళూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లే వాహనాలన్నీ ఈ కూడలి ప్రాంతం ద్వారా రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ ప్రాంతంలో జగన్ సభ నిర్వహిస్తుండడంతో వాహనాలను దారి మళ్లించారు. నెల్లూరు నుంచి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు గూడూరు జంక్షన్ నుంచి బాలయ్యపల్లి, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా తిరుపతికి, నెల్లూరు వైపు నుంచి శ్రీకాళహస్తికి వెళ్లే వాహనాలు గూడూరు జంక్షన్ నుంచి బాలయపల్లి, వెంకటగిరి నుంచి శ్రీకాళహస్తికి, నెల్లూరు వైపు నుంచి చెన్నై వెళ్లే వాహనాలు నాయుడుపేట మండలం పండ్లూరు జంక్షన్ నుంచి తుమ్మూరు, ఆర్టీసీ బస్టాండ్, మల్లాం జంక్షన్ నుంచి నాయుడుపేట నుంచి తిరుపతి వైపుకు వెళ్లే వాహనాలు వెంకటగిరి మీదుగా తిరుపతికి వెళ్లవాల్సిందని, చెన్నై నుంచి నెల్లూరుకు వెళ్లే వాహనాలు నాయుడుపేట నరసారెడ్డికండ్రిగ జంక్షన్ నుండి కుడివైపు నుంచి మర్లపల్లి గ్రామం, అన్నమేడు జంక్షన్ నుంచి నెల్లూరుకు వెళ్లేలా దారి మళ్లించారు. దీంతో పట్టణ ప్రజలతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అరాచక పాలనకు చరమగీతం పాడండి


మాబాకలో ప్రచారం నిర్వహిస్తున్న పరసారత్నం, నెలవల, విజయశ్రీ

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 3: రాష్ట్రంలో అరాచక పాలనకు చరమగీతం పాడాలని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని మాబాక, ద్వారకాపురం, తిమ్మాజికండ్రిగ గ్రామాల్లో బుధవారం మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీతో కలసి ప్రచారం నిర్వహించారు. ముందుగా కోనేటిరాజుపాళెం వద్ద తెలుగు యువత నేత గాలి రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాబాక, ద్వారకాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పరసారత్నం మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ పాదయాత్రలో మద్యపాన నిషేధం అమలు చేస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు గూడూరు ప్రభావతమ్మ, టీడీపీ నాయకులు ఉషారాణి, రఫీ, మధునాయుడు, వేమసాని శోభన్ నాయుడు, దయాకర్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు, పరసా రాజా, అవధానం సుధీర్, రవి, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే మహిళల రక్షణ

గూడూరు, ఏప్రిల్ 3: టీడీపీ పాలనలోనే మహిళల రక్షణ లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ సతీమణి సంధ్యారాణి అన్నారు. బుధవారం స్థానిక వాలాయనందపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై దౌర్జన్యాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఉమ్మడి కూటమిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, వీరుబోయిన వెంకటేశ్వర్లు, నటశేఖర్, మునీంద్రబాబు, వల్లూరు మోహన్, చైతన్య, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

- ఎస్వీయూలో అక్రమ నియామకాల్లో అధికార పార్టీ నేతల లెక్క

3..7..2



12మంది నాన్ టీచింగ్ సిబ్బంది నియామకంపై వీసీని విచారించిన కమిషనర్

కోడ్‌కు ముందే నిర్ణయం తీసుకున్నామన్న వీసీ

తిరుపతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 'నీకు 3...నాకు 7...ఆయనకు 2 ...మొత్తం కలిపితే 12. ఎన్నికల కోడ్ ముందు పెట్టుకుని శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో జరిగిన ఉద్యోగుల అక్రమ నియామక సంఖ్య ఇది. వర్సిటీ వర్గాల్లో దుమారం రేపుతున్న ఈ వ్యవహారం వెనుక అధికారపార్టీ కీలక మంత్రి ఒత్తిడే ప్రధానంగా తెలుస్తోంది. ఆయనతో పాటు చంద్రగిరి, తిరుపతికి చెందిన నేతల ఒత్తిళ్లతోనే ఎస్వీయూలో ఎన్ఎంఆర్ పద్ధతిలో 12మంది నాన్ టీచింగ్ సిబ్బంది నియామకాలు చేపట్టినట్లు సమాచారం. దీనిపై ఎన్నికల సంఘం దృష్టిసారించి తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, మున్సిపల్ కమిషనర్ అదితి సింగ్‌ను విచారణ అధికారిగా నియమించింది. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందే నిర్ణయం తీసుకున్నామని, అయితే కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత వారు విధుల్లోకి వచ్చారని వీసీ వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది.వీసీని విచారించిన కమిషనర్ వారిచ్చిన సమాచారం మేరకు నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు పంపారు. మూడు నెలల ముందు వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి అధికార పార్టీ కీలకనేత సిఫార్సుకు 7, చంద్రగిరి నేతకు 3, తిరుపతి నాయకుడి సిఫార్సుకు 2 పోస్టుల చొప్పున ఎన్ఎంఆర్ పద్ధతిలో నాన్ టీచింగ్ సిబ్బంది ఉద్యోగాలు కట్టబెట్టేశారు.అది కూడా ఎస్వీయూ పరిపాలనా విభాగంలోని ఎగ్జామ్స్, ఈడీపీ సెల్, అకౌంట్స్, నాక్ వంటి కీలక విభాగాల్లో పోస్టింగు ఇవ్వడం వర్సిటీ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. ఎన్నికల కోడ్ గత నెల 16న అమల్లుకి వస్తే నియమితులైన నాన్‌టీచింగ్ సిబ్బంది మాత్రం 18వ తేదీ జాయినయ్యారు. ముందస్తు డేట్ వేసి ఉత్తర్వులు ఇచ్చినట్టు విమర్శలున్నాయి. ఎన్నేళ్లుగా పనిచేస్తున్న ఉద్యోగుల మాదిరిగానే కొత్తవారికి కూడా జీతభత్యాలు కల్పించడంపై పాత ఉద్యోగులు ఆగ్రహంతో ఉన్నారు.సిబ్బంది ఎవరో బయటకు సమాచారం ఇవ్వడంతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చిందని భావించిం నాన్ టీచింగ్ సిబ్బందిపై గుర్రుమీద ఉన్నట్టు సమాచారం. అందుకే ఇటీవల సాయంత్రం 4.30గంటలపైన విధుల్లోలేని 22 మంది నాన్ టీచింగ్ సిబ్బందికి మెమోలు జారీచేశారు.కాగా అక్రమ నియామకాలపై ఈసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చూడాల్సి ఉంది.

ఎస్వీయూ రిజిస్ట్రార్‌కు షోకాజ్

ఎస్వీయూలో అక్రమ నియామకాలపై ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితి సింగ్ విచారణ జరిపి కలెక్టర్‌కు మూడు రోజుల ముందు నివేదిక పంపారు. అయితే కమిషనర్ నివేదికతో సంతృప్తి చెందనట్టు తెలుస్తోంది. నియామకాలపై ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్‌ను సమగ్రంగా వివరణ కోరుతూ తాజాగా కలెక్టర్ షోకాజ్ పంపారు. దీనిపై ఎస్వీయూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నట్టు తెలుస్తోంది. అసలే ఆగ్రహంగా ఉన్న ఎన్నికల కమిషన్ ముందు అడ్డంగా దొరికిపోతే వేటుతప్పదన్న ఆందోళనలో ఉన్నతాధికారులు ఉన్నట్టు సమాచారం.

రైలు పట్టాల పక్కన యువతి మృతదేహం


మృతి చెందిన మహిళ

పుత్తూరు, ఏప్రిల్ 3: పుత్తూరు మండలం శిరుగురాజుపాలెం గ్రామం సమీపంలో రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని 35 ఏళ్ల యువతి మృతదేహాన్ని రైల్వే పోలీసులు గుర్తించారు. మంగళవారం రాత్రి చెన్నై వెళ్లే రైలు ఢీకొనడంతో ఆమె చనిపోయి వుంటుందని పోలీసులు భావిస్తున్నారు. తల మీద మాత్రమే దెబ్బ తగిలిందని ఎస్ఐ పెరుమాళ్ తెలిపారు. మృతురాలు పింక్ కలర్ జాకెట్టు, పచ్చ కలర్ చీర ధరించి వుందని, కుడి దవడ కింద నల్లటి మచ్చ వుందని వెల్లడించారు. మృతదేహాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

సీఎం సభకు బస్సులు.. ప్రయాణికుల వెతలు

పుత్తూరు, ఏప్రిల్ 3: సీఎం జగన్ సభకు పుత్తూరు డిపో నుంచి 40 బస్సులను తరలించడంతో ప్రయాణికులు తీవ్రఇబ్బందులు పడ్డారు. డిపోలో దాదాపు 75 సర్వీసులు మాత్రమే వున్నాయి. వీటిలో 40 బస్సులను సీఎం సభకు తరలించడంతో తిరుపతి, కంచి, తిరుత్తణి పట్టణాలతో పాటు గ్రామాలకు వెళ్లే ప్రయాణికులు అవస్థలు పడ్డారు.

ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేద్దాం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 3: గుంటూరులో ఈనెల 8వ తేదీన నిర్వహించనున్న ఎమ్మార్పీఎస్ సభను విజయవంతం చేద్దామని ఆ సమితి జిల్లా సీనియర్ నాయకులు శివయ్య మాదిగ పిలుపునిచ్చారు. బుధవారం ఎమ్మార్పీఎస్ మండల నాయకుల సమావేశం జరిగింది. గుంటూరులో ఎమ్మార్పీఎస్ నాయకుడు మందకృష్ణ మాదిగ పాల్గొననున్న సభకు ప్రతి గ్రామం నుంచి మాదిగలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మునివేల్ మాదిగ, వెంకట హరిప్రసాద్, గోవిందరాజు, అజిత్, యుగంధర్, భాస్కర్, వేణు, నాగరాజు, నాగభూషణం, శివ తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

మృతురాలికి నివాళి


పద్మమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న భానుప్రకాష్

వడమాలపేట, ఏప్రిల్ 3: మండలంలోని రామసముద్రం గ్రామానికి చెందిన, టీడీపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు పూల ప్రవీణ్ తల్లి పద్మమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఆమె మృతదేహానికి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. అలాగే వడమాలపేట నారాయణదాసు తోటలో ఇటీవల టీడీపీ నాయకుడు బాలాజీ తండ్రి జనార్దన్ మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

వడమాలపేట, ఏప్రిల్ 3: మండలంలోని ఏఎంపురం, నారాయణపురం, సీతారామపురం, బాలినాయుడు కండ్రిగ, ఎస్‌వీఆర్ కండ్రిగ, బంగారెడ్డి కండ్రిగ, పోలింగ్ కేంద్రాలను అధికారులు బుధవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో వసతుల గురించి ఆరా తీశారు.

పింఛన్ల కోసం పడిగాపులు


సచివాలయం వద్ద పింఛన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 3: సామాజిక భద్రతా పింఛన్ల కోసం వృద్ధులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒకటో తేదీన అందించాల్సిన పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం ఆలస్యం చేయడంతో వారిలో ఆందోళన నెలకొంది. బుధవారం నుంచి పింఛన్లను ఆయా సచివాలయాల వద్ద అందిస్తారనే ప్రచారం జరగడంతో లబ్ధిదారులు ఉదయం నుంచే పడిగాపులుకాశారు. అయితే అధికార యంత్రాంగం సరైన సమచారం అందించకపోవడంతో లబ్ధిదారులు ఉదయం నుంచి సచివాలయాల చుట్టూ ప్రదిక్షిణ చేయాల్సి వచ్చింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో వృద్ధులు, మహిళలు నరకం చూశారు. మధ్యాహ్నం బ్యాంకులో నగదు అందడంతో 3 గంటల నుంచి సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ ఎట్టకేలకు మొదలైంది. మున్సిపల్ పరిధిలో 5,894, మండలంలో 3,866 మంది లబ్ధిదారులు ఉండగా బుధవారం సాయంత్రానికి 50శాతం వరకు పంపిణీ పూర్తి చేశారు.

ఇంటింటా బీజేపీ జెండా


బీజేపీ మండల సమావేశం

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 3: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6వ తేదీన ఇంటింటా బీజేపీ జెండా ఎగురవేసేలా కార్యకర్తలు, నాయకులు చొరవ తీసుకోవాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం పదేళ్లలో తీసుకువచ్చిన విప్లవాత్మక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకుడు భక్తవత్సలం, మునస్వామి, గణేష్, హరి, కిషోర్, సుబ్రహ్మణ్యం, రాజేంద్రరాజు, చక్రపాణినాయుడు, వెంకటకృష్ణంరాజు, శేఖర్, పుష్ప, అమరావతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పుత్తూరు, ఏప్రిల్ 3: ఆర్టీసీ అధికారులతో పాటు సిబ్బంది అందరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని డిపో మేనేజర్ ప్రశాంతి ఆదేశించారు. డిపోలోని సర్వీసులను వివిధ విభాగాధిపతులతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. డిపోలోని ఓ బస్సు అద్దం మీద సిద్ధం సభ పోస్టర్ వుందని ఓ పత్రికలో వార్త ప్రచురితం కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

టీడీపీ నేతలకు ఆదిమూలం పరామర్శ

నారాయణవనం, ఏప్రిల్ 3: నారాయణవనానికి చెందిన టీడీపీ సీనియర్ నేత ఎస్ఎన్.దొరస్వామి మొదలియార్ అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయనను సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలం బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మసీదు వీధిలో నివాసం ఉంటున్న మరో నాయకులు బండారు కేశువులును పరామర్శించారు. ఆయన ఆరోగ్య స్థితితెలుసుకున్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

నల్ల గంగమ్మకు పూజలు


అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటున్న సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: పట్టణంలోని నల్ల గంగమ్మను ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించి పూజలు చేశారు. అమ్మవారి జాతర పురస్కరించుకొని బుధవారం సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి రిషితా రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతకు ముందు నల్ల గంగమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ కంఠా రమేష్ వారికి స్వాగతం పలికి శేష వస్త్రంతో సత్కరించి దర్శనం ఏర్పాట్లు చేశారు. అనంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అపాచీ పరిశ్రమ ఏది...?


టీడీపీ నాయకుల నిరసన ప్రదర్శన

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: అపాచీ పరిశ్రమ ఏదంటూ టీడీపీ నాయకులు ప్రశ్నిస్తూ నిరసన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి మండలంలోని ఇనగలూరు వద్ద సీఎం జగన్ అపాచీ పాదరక్షల పరిశ్రమ తెస్తున్నామంటూ భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. ఆతర్వాత అక్కడ శిలాఫలకం కూడా మాయమైంది. దీనిపై భూమి పూజ చేసిన ప్రాంతంలో బుధవారం టీడీపీ నాయకులు పరిశ్రమ ఎక్కడ ఉందంటూ నిరసన ప్రదర్శించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు తాటిపర్తి ఈశ్వర్ రెడ్డి, చెంచయ్య నాయుడు, కామేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను టీడీపీ ఆదుకుంటుంది


భాస్కర్‌నాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆదిమూలం

కేవీబీపురం, ఏప్రిల్ 3: ఇటీవల మరణించిన ఆర్టీసీ డ్రైవర్ భాస్కర్‌నాయుడు, అలాగే రాజుల కండ్రిగలో సీనియర్ టీడీపీ నాయకులు కేశవులునాయుడు అత్త మణెమ్మ మరణించిన విషయం తెలుసుకుని బుధవారం సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం, మండల టీడీపీ అధ్యక్షుడు రామాంజులనాయుడు, పార్లమెంటు రైతు అధ్యక్షుడు గోపీనాథరెడ్డి, సత్యవేడు సమన్వయకర్త మల్లికార్జునరెడ్డి తదితరులు బాధిత కుటుంబాలను పరామర్శించి టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యకర్తల, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం అధికారంలోకి రావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు.

ఆవలరేవు స్థలంపై కన్నేస్తే చర్యలు

- రికార్డులు పరిశీలించిన తహసీల్దారు
- బాధిత రైతులకు న్యాయం చేస్తామని హామీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏర్పేడు, ఏప్రిల్ 3: మండలంలోని నాగంపల్లి వద్ద ఆవలరేవు ప్రభుత్వ స్థలంలో ఉన్న బండిబాటను స్థానిక వైసీపీ నేతలు కొందరు కబ్జాకు పాల్పడి అక్రమంగా ప ట్టాలు పొందేందుకు అధికారులపై ఒత్తిడితెచ్చారు. 'ఆవలరేవు అక్రమణకు యత్నం' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం వార్త ప్రచురణ అవడంతో స్పందించిన ఏర్పేడు తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ రాజు రికార్డులను పరిశీలించారు. కృష్ణంపల్లి రెవెన్యూ పరిధిలో ఉన్న ఆవలరేవుకు సంబంధించిన సర్వే నెంబరు 303/5, 303/6లో సుమారు 1.26ఎకరాల ప్రభుత్వ స్థలం రైతుల పొలాలను ఆనుకుని అటవీ ప్రాంతం వద్ద ఉన్నట్లు గుర్తించారు. ఆవలరేవు బండిబాట ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో గురువారం సర్వే నిర్వహించి హద్దురాళ్లను ఏర్పాటు చేసి రైతులకు న్యాయంచేస్తామని బాధిత రైతులను బుధవారం తన కార్యాలయానికి పిలిపించి తహసీల్దార్ హామీ ఇచ్చారు. ప్రభుత్వ స్థలాలపై కన్నేసి ఆక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తే ఎ ంతటివారైనా ఉపేక్షించేది లేదని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన అక్రమార్కులను హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలి

- జోనల్ ఎన్నికల అధికారి రాజశేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 3: మండలంలోని 35 పోలింగ్ కేంద్రాలలో అన్ని వసతులు కల్పించాలని జోనల్ ఎన్నికల అధికారి రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్న మూడు పోలింగ్ కేంద్రాలను గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహ్మద్ అలీఖాన్, డిప్యూటి తహసీల్దార్ చంద్రబాబునాయుడు, బీఎల్‌వోలు తదితరులు పాల్గొన్నారు.

సృజనాత్మకంగా బోధన చేయించండి

తరగతిలో విద్యార్థులకు సృజనాత్మకంగా బోధన చేయాలని బీఎన్ కండ్రిగ మండల విదాశాఖాధికారి మునిసుబ్రహ్మణ్యం సూచించారు. మండలంలోని గాజులపెళ్ళూరు గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను గురువారం పరిశీలించారు.

విద్యార్థినికి సన్మానం


మౌనికకు నగదు బహుమతి అందజేస్తున్న ఎంఈవో దయాకర్

ఏర్పేడు, ఏప్రిల్ 3: మండలం కాట్రకాయలగుంట ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న మౌనిక నవోదయ పాఠశాలకు ఎంపికైన సందర్భంగా బుధవారం ఎంఈవో-2 దయాకర్ విద్యార్థినిని అభినందిస్తూ నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కల్పన, విద్యార్థిని తల్లిదండ్రులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

నల్ల గంగమ్మకు సారె సమర్పణ


సారె అందజేస్తున్న అంజూరు శ్రీనివాసులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: పట్టణంలోని కంఠా వీధిలో వెలసిన నల్ల గంగమ్మకు సారే సమర్పించారు. బుధవారం అమ్మవారి జాతర పురస్కరించుకుని ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు.

నీటి వృథాను అరికట్టండి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: తాగునీటి వృథాను అరికట్టాలని ఎన్టీఆర్ నగర్ ప్రజలు విజ్ఞప్తి చేశారు. తమ ప్రాంతంలో వారం రోజులుగా పైపైన్ దెబ్బతినడంతో నీరు వృథాగా పోతున్నట్లు బుధవారం సామాజిక మధ్యమాల్లో పోస్టు చేశారు. సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీకి మరమ్మత్తులు చేయాలని ఎన్టీఆర్ నగర్ ప్రజలు కోరుతున్నారు.

ఛత్రపతి సేవలు చిరస్మరణీయం


శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అభిమానులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: ఛత్రపతి శివాజీ సేవలు చిరస్మరణీయమని భారత్ ఆర్గనైజేషన్ ఆఫ్ సోషల్ సర్వీస్ వ్యవస్థాపకుడు సుధాకర్ అన్నారు. పట్టణంలోని రామసేతు వంతెన వద్ద బుధవారం సంస్థ ఆధ్వర్యంలో శివాజీ వర్ధంతి పురస్కరించుకుని ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు ఆర్టీసీ బస్సుల తరలింపు

- ప్రయాణికులకు అవస్థలు


బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

నాగలాపురం, ఏప్రిల్ 3: నాయుడు పేటలో సీఎం జగన్మోహన్‌రెడ్డి సభకు సత్యవేడు డిపో నుంచి 15 బస్సులు తరలించారు. దీంతో సత్యవేడు నుంచి తిరుపతి, శ్రీ కాళహస్తి మార్గాల్లో వెళ్లే ప్రయాణికులు, విద్యార్థులు గంటల తరబడి బస్సుల కోసం వేచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రతీ సారీ ఇలా సీఎం సభకు ప్రభుత్వ బస్సులను తరలించడంతో ప్రయాణికులు గంటలు గంటలు బస్సుల కోసం వేచి ఉండలేక తన సహనాన్ని కోల్పోయి ప్రభుత్వ తీరుపై తీవ్రంగా మండి పడుతున్నారు. మరి కొందరు సీఎం సభ అంటే చాలు ఆ రోజు బస్సుల కోసం వేచి ఉండలేక తమ ప్రయాణాన్ని వాయిదా వేసుకునే పరిస్థితి చోటు చేసుకుంది.

కేంద్ర బలగాల కవాతు



తొట్టంబేడు ఏప్రిల్ 3: మండలంలోని ఇలగనూరు, పూడి, గుర్రప్ప నాయుడు కండిగ, కొనతనేరి గ్రామాల్లో ఎస్సై రాఘవేంద్ర ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు బుధవారం కవాతు నిర్వహించారు.

పూడికతీత పనుల పరిశీలన


ఉపాధి పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ

నాగలాపురం, ఏప్రిల్ 3: సత్యవేడు మండలంలోని నరసరాజు అగ్రహారం గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన చెరువు పూడిక తీత పనులను డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస ప్రసాద్ పరిశీలించారు. బుధవారం ఆయన నరసరాజు అగ్రహారం చెరువు వద్దకు వెళ్లి ఉపాధి హామీ పనుల్లో కూలీలకు అందుతున్న రోజువారి కూలి సొమ్ముపై ఆరా తీశారు. కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రాజు, ఈసీ గుణశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు సుమలత, మనోహర్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ధరణి కుమార్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపు ప్రగతికి మలుపు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: టీడీపీ గెలుపు ప్రగతికి మలుపని శ్రీకాళహస్తి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 1,2,3 వార్డుల్లో బుధవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఇందులో భాగంగా మొదట 1వ వార్డు పరిధిలోని వీఎం పల్లె నుంచి ప్రచారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, లక్ష్మణ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

మేర్లపాక మాజీ సర్పంచ్‌కు నివాళి


మల్లీశ్వరమ్మ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న బృందమ్మ

ఏర్పేడు, ఏప్రిల్ 3: మేర్లపాక పంచాయతీ మాజీ సర్పంచ్ తోటకూర మల్లీశ్వరమ్మ(75) అనారోగ్యంతో మంగళవారం సాయంత్రం మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆయనతల్లి బొజ్జల బృందమ్మ ఆ గ్రామానికి వెళ్లి మల్లీశ్వరమ్మకు నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. .ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జగన్నాథంనాయుడు, మోహన్‌నాయుడు, చెంచయ్యానాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్కూటర్‌పై నుంచి జారిపడి కానిస్టేబుల్‌కు గాయాలు

కేవీబీపురం, ఏప్రిల్ 3: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ప్రభాకర్(31) ప్రమాదంలో గాయపడ్డాడు. బుధవారం సాయంత్రం విధులు ముగించుకుని ఆయన తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తుండగా ఆరె సమీపంలోని బంగారమ్మ గుడి సమీపంలో స్పీడ్‌బ్రేకర్ వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో ఆయనకు తలకు బలమైనగాయం కావడంతో 108 వాహనంలో ఆయనను శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఏఎస్‌ఐ లోకనాథం తెలిపారు.

పింఛను కోసం పడిగాపులు


వరదయ్యపాళెం సచివాలయంలో సాయంత్రం 4.30గంటలకు పింఛను పంపిణీ చేస్తున్న సచివాలయ సిబ్బంది - డబ్బు రాలేదని చెప్పడంతో వెనుదిరిగిన అబ్దుల్ (ఇన్‌సెట్‌లో) - పింఛనుదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 3: పింఛన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పడిగాపులు కాయాల్సి పరిస్థితి ఏర్పడింది. బుధవారం పింఛను పంపిణీ చేస్తారని చెప్పడంతో ఉదయం నుంచే సచివాలయాల వద్ద పడిగాపులు కాశారు. మధ్యాహ్నం వరకు కూడా పింఛను అందకపోవడంతో మండుటెండలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మధ్యాహ్నం 3గంటలకు డబ్బు వచ్చింది. కార్యాలయం వద్దకు ఈవో బసిరెడ్డి చేరుకోగా ఎమ్మెల్యే ఆదిమూలం ఆయనను ప్రశ్నించగా, ఇప్పుడే బ్యాంకు నుంచి డబ్బు వచ్చింది పంపిణీ చేస్తామన్నారు. ఈ స ందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ టీడీపీ అధినేత చంద్రబాబుపై బురదజల్లే ప్రయత్నంలో భాగంగా 1వతేదీ పంపిణీ చేయాల్సిన పింఛనును 3వ తేదీ ఇస్తున్నారన్నారు. పింఛన ఇవ్వలేని స్థితిలో వైసీపీ ప్రభుత్వం ఉందన్నారు. ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నం మానుకోవాలన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో వృద్ధులు పింఛన్ల కోసం బుధవారం ఇబ్బంది పడ్డారు. ఉదయం 8గంటలకే సచివాలయానికి వృద్ధులు అతి కష్టం మీద చేరుకున్నారు. కాంపాళెం పంచాయతీ పరిధిలోని కొండ కింద ఉన్న చలం వారి గిరిజన కాలనీ వాసులు నాలుగు కిలోమీటర్లు దూరం నడుచుకుని వచ్చి పింఛన్లు తీసుకున్నారు. ప్రతి సచివాలయంలో వృద్ధులకు తాగునీరు, శామియానా ఏర్పాటు చేశారు. పల్లమాల సచివాలయ పరిధిలోని వృద్ధులకు సర్పంచ్ రమణమ్మ బిరియాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. మండలంలో 14 సచివాలయ పరిధిలో 73 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం నుంచి బెడ్ మీద ఉన్న వారందరికి ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేయనున్నట్లు తెలిపారు.

రేణిగుంటలో...

రేణిగుంట: మండల వ్యాప్తంగా పింఛను పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. బుధవారం ఉదయం పింఛను దారులు సచివాలయాలకు చేరుకోగా డబ్బులు ఖాతాలో ఇంకా వేయలేదని మధ్యాహ్నం 3గంటలకునుంచి ఇస్తామని అధికారులు తెలియజేశారు. అక్కడికి వచ్చిన వృద్ధులకు వైసీపీ నాయకులు టిఫిన్ అందజేశారు. సాయంత్రం 4గంటలకు పింఛను పంపిణీ ప్రారంభించారు. అయితే వైసీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేసే దగ్గర లబ్ధిదారులకు టీ, మజ్జిగ పంపిణీ చేశారు.


బీఎన్‌కండ్రిగలో పింఛన్ల కోసం మూడు కిలోమీటర్లు నడిచి వస్తున్న గిరిజనులు - పింఛన్ల కోసం కార్డులతో నిరీక్షణ - రేణిగుంట సచివాలయం 1లో పింఛన్లు ఇస్తున్న అధికారులు - పింఛనుదారులకు ఎంపీడీవో సమావేశమందిరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్ నగేశం

కుట్రతోనే పింఛన్ల నాటకం

- టీడీపీపై నిందలు
- ప్రజలే వైసీపీకి బుద్ధి చెబుతారు: ఎమ్మెల్యే


టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో సమావేశమైన కోనేటి ఆదిమూలం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 3: కుట్రతోనే పింఛన్లు ఆపేసి తమ రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నాటకమాడుతోందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. వరదయ్యపాళెంలోని దివంగత మాజీ ఎంపీపీ వన్నెం జీవమ్మ, టీడీపీ సీనియర్ నాయకులు వన్నెం బాలసుందరం స్వగృహంలో బుధవారం టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కో నేటి ఆదిమూలం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల సొమ్మును గుత్తేదారులకు పక్కదారి పట్టించి పింఛను పంపిణీకి వాలంటీర్లను తప్పించారనే నింద టీడీపీపై వేసేందుకు వైసీపీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని ఉమ్మడి పార్టీల నాయకులకు పిలుపునిచ్చారు. మంత్రి అండదండటతో సత్యవేడులో మట్టిదోపిడీ అక్రమ రవాణా ఇంకా సాగుతోందన్నారు. ఇసుక, మట్టి ద్వారా దోచుకున్న డబ్బుతో ఎస్సీలను రెచ్చగొట్టి కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా జగన్ సభలకు మద్యం, డబ్బులు ఇచ్చి దూరప్రాంతాల నుంచి బస్సుల్లో జనాలను తరలించాల్సిన దౌర్భాగ్యం ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యుగంధర్ రెడ్డి, నరసరాజు, గోవిందయ్య, శివయ్య, వన్నెం నిర్మల్ జనసేన నాయకులు తడ శ్రీను, బీజేపీ నాయకులు పురుషోత్తం, సుబ్బరత్నమ్మ, సిద్ధులయ్య తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా నల్ల గంగమ్మ జాతర


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


నల్ల గంగమ్మ ఉత్సవమూర్తి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: శ్రీకాళహస్తి పట్టణంలోని బహదూర్ పేట ప్రాంతంలో బుధవారం నల్ల గంగమ్మ జాతర వేరుగా జరిగింది. బుధవారం వేకువ జామున అమ్మవారి ఉత్సవమూర్తి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. భక్తులు దారి పొడవునా కుంభం నైవేద్యాలతో ఏటలు సమర్పించారు. అలాగే కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులతో నీరాజనం పలికారు. అమ్మవారి ఊరేగింపు అనంతరం ఉత్సవమూర్తిని కంఠా వీధిలో కొలువు తీర్చారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు భక్తులు వేపముండలతో వెయ్యి కళ్ళ దుత్తలను శిరస్సుపై దాల్చి అమ్మవారికి ప్రదక్షిణలు చేసి సమర్పించారు. ఇక నల్ల గంగమ్మ ఆలయంలో స్థానిక మహిళలు పొంగళ్ళు పెట్టి ముక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి ఉత్సవ మూర్తి నిమజ్జనంతో జాతర ముగిసింది. ఆలయ పాలక మండలి ఛైర్మెన్ కంఠా రమేష్ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



సమావేశంలో మాట్లాడుతన్న ఎంఈవో బాలయ్య

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 3: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించడం సాధ్యమని శ్రీకాళహస్తి మండల విద్యాశాఖ అధికారి బాలయ్య అన్నారు. పట్టణంలోని సన్నిధి వీధి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో భువనేశ్వరి, సీఆర్‌ఎంటి మోహన్, ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన, ఉపాధ్యాయులు హేమకుమార్, అరుణ, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు గోపాలకృష్ణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు


టీడీపీలో చేరిన నాయకులతో సుధీర్ ప్రచారం


మునిరాజ యాదవ్‌ను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న సుధీర్‌రెడ్డి

ఏర్పేడు, ఏప్రిల్ 3 : బీసీ సంక్షేమ సంఘం చిత్తూరు జిల్లా కార్యనిర్వాహక మాజీ కార్యదర్శి మునిరాజ యాదవ్ టీడీపీలో చేరారు. ఏర్పేడు మండలానికి చెందిన మునిరాజ యాదవ్‌కు బుధవారం ఉదయం సుధీర్‌రెడ్డి పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే చెల్లూరు సర్పంచ్ జ్ఞానప్రసూనాంబ భర్త జనార్దన్ తన అనుచరులు 30 మందితో కలిసి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మునగలపాళెం పంచాయతీ కుమ్మరిగుంట గ్రామానికి చెందిన మైనార్టీ సెల్ వైసీపీ నాయకుడు షేక్ రఫీ కూడా పసుపు కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన వారు మాట్లాడుతూ తాము వైసీపీలో అడుగడుగునా అవమానాలకు గురయ్యామన్నారు. సుధీర్‌రెడ్డి గెలుపుకోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏర్పేడు టీడీపీ ఇన్‌ఛార్జి పేరం ధనంజయులు నాయుడు,పార్టీ మండలాధ్యక్షుడు పొన్నారావు, నాయకులు పేరం నాగరాజునాయుడు, మంజుభార్గవి, సతీష్ నాయుడు, సుబ్రహ్మణ్యం, పూల హేమాక్షి తదితరులు పాల్గొన్నారు.



దామలచెరువులో జగన్ కోసం ఎండలో వేచివున్న వైసీపీ శ్రేణులు

ట్రాఫిక్ ఆంక్షలతో నరకం

జగన్ బస్సు యాత్ర పర్యవసానం



గంటన్నర ముందే దామలచెరువు హైస్కూల్ విద్యార్థులను ఇండ్లకు పంపివేసిన ఉపాధ్యాయులు

పాకాల, ఏప్రిల్ 3: మేమంతా సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి జగన్ చేపట్టిన బస్సుయాత్ర కారణంగా చేపట్టిన ట్రాఫిక్ ఆంక్షలతో బుధవారం వాహనదారులకు, ఆర్టీసీ ప్రయాణికులకు నరకం కన్పించింది.పాకాల మండల పరిధిలోని పదిపుట్లబైలు నుండి దామలచెరువు వరకు జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఆంక్షలతో ఈ మార్గంలో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు పుంగనూరు, పీలేరు వైపు వెళ్లడానికి గంటల తరబడి వేచి వుండాల్సివచ్చింది. మొగరాల, పులిచెర్ల, రొంపిచెర్ల క్రాస్ మీదుగా కిలోమీటర్ల మేర అదనంగా ప్రయాణించాల్సి వచ్చింది. దామలచెరువు హైస్కూల్ గేటులో వున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గంటన్నర ముందే అనధికార సెలవు ప్రకటించేశారు. మీడియా ఆరా తీయడంతో ఉపాధ్యాయులు రోడ్డుపై వున్న కొంతమంది పిల్లలను మళ్లీ పాఠశాలలకు తీసుకెళ్లారు. జగన్‌కు స్వాగతం పలకడానికి తీసుకొచ్చిన బాణాసంచా పేల్చకపోవడంతో పార్టీశ్రేణులు తిరిగి గోడౌన్‌లో భద్రపరిచారు. ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2-30 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో అవస్థలు పడ్డారు. యాత్ర ముగిసిన తరువాత గంటకు పైగా ట్రాఫిక్ క్లియర్ కాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా జగన్‌కు బుధవారం దామలచెరువులో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి, చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు.అయితే జగన్ బస్సుపై నుంచి కాసేపు, బస్సులో నుంచి కాసేపు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.

కొనసాగుతున్న మహాకుంభాభిషేక వేడుకలు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 3: తిరుపతి గ్రామదేవత తాళ్లపాక పెద్దగంగమ్మ ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవం బుధవారమూ కొనసాగింది. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదమంత్రోచ్చారణల నడుమ పంచగవ్య అధివాసం, బింబశుద్ధి, సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం కైంకర్యాలు గావించారు. టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, గ్రూపు ఆలయాల ఈవో కె.మమత, కమిటీ ఛైర్మన్ బాబుయాదవ్ పాల్గొన్నారు. చివరి రోజైన గురువారం ఉదయం గర్త, శిల, రత్న, ధాతున్యాసములు చేపడతారు. అనంతరం పెద్దగంగమ్మ యంత్ర, విగ్రహ, శిఖరకలశ స్థాపన, మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేక మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12గంటలకు అమ్మవారికి సర్వాలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పిస్తారు.







సీఎం మాట్లాడుతుండగానే రోడ్డుపైకి వచ్చేస్తున్న జనం - బస్సుయాత్రలో అభివాదం చేస్తున్న జగన్

జిల్లా గురించి ప్రస్తావించలేదు

పాత హామీలపై మాట్లాడలేదు

- పూతలపట్టు సభలో జగన్ ప్రసంగం బోర్ కొట్టడంతో వెనుదిరిగిన జనం

తిట్లతో సరిపెట్టారు

చిత్తూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సమస్యల గురించి ప్రస్తావించలేదు. ఈ ఐదేళ్లలో జిల్లాకు ఏం చేశామో చెప్పలేకపోయారు. మళ్లీ అధికారంలోకి వస్తే ఫలానా మంచి చేస్తాననీ చెప్పలేదు. కేవలం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని తిట్టడంతో సరిపెట్టుకున్నారు. ఇలా బుధవారం పూతలపట్టు మండలం మూర్తిగానిపూరు సమీపంలో జరిగిన మేమంతా సిద్ధం సభలో గంటకుపైగా సాగిన సీఎం జగన్ ప్రసంగం జనాన్ని ఆకట్టుకోలేకపోయింది. ప్రతిపక్షాలను విమర్శించడానికి, చంద్రబాబును తిట్టడానికే ఎక్కువ సమయం కేటాయించారు. 130 సార్లు బటన్లు నొక్కానని, ఆయా పథకాల గురించి చెప్పుకొన్నారు. ఇలా చప్పగా సాగిన జగన్ ప్రసంగంతో జనం ఎక్కువసేపు సభలో ఉండలేకపోయారు. వైసీపీ నాయకులు బలవంతంగా జనాల్ని తీసుకొచ్చినా.. జగన్ ప్రసంగం మొదలు పెట్టిన కాసేపటికే ఒక్కో గ్యాలరీ ఖాళీ అవుతూ కనిపించింది. షెడ్యూల్ కంటే రెండున్నర గంటలు ఆలస్యంగా రావడంతో ఎండలో ప్రజలు అప్పటికే విసిగిపోయారు. కొందరు జగన్ రాకముందు, మరి కొందరు జగన్ వచ్చాక.. ఇంకొందరు ఆయన ప్రసంగం మొదలు పెట్టాక వెనక్కి వెళ్లిపోయారు.

పార్టీలో చేరికలు

చాలాకాలంగా రాజకీయాలకు దూరంగా ఉంటున్న వారిలో కొందరు సీఎం జగన్ సమక్షంలో వైసీపీ కండువా కప్పుకొన్నారు. 2019 ఎన్నికల సమయంలో టీడీపీలో చేరిన కుప్పం నియోజకవర్గ నేత, జడ్పీ మాజీ ఛైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి వైసీపీ అధికారంలోకి వచ్చాక రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. 2019 ఎన్నికల్లో పూతలపట్టు, జీడీ నెల్లూరు నుంచి టీడీపీ తరపున పోటీ చేసిన లలితమ్మ, హరికృష్ణ కూడా ఐదేళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఈ ముగ్గురూ బుధవారం సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు.



ఐదేళ్ల తర్వాత ముద్దులు

గత శాసనసభ ఎన్నికల ముందు పాదయాత్రలో అవ్వతాతలను జగన్ ఆప్యాయంగా పలకరించి ముద్దులు పెట్టి తలపై చేతితో నిమురుతూ మందుకు సాగారు. ముఖ్యమంత్రి అయ్యాక.. ఈ ఐదేళ్లలో ప్రజలు కలవడానికి అవకాశం ఇవ్వలేదు. కనీసం ఎవరినీ దగ్గరకు రానీయలేదు. మళ్లీ ఇప్పుడు ఎన్నికలు రావడంతో జగన్ 'ఓట్ల ముద్దులు' తో వసుతన్నారు. బుధవారం ఆయన పులిచెర్ల మండలం చిట్టిరెడ్డిపేట తదితర ప్రాంతాల్లో బస్సుయాత్రలో ఉన్న సీఎం జగన్ బస్సుదిగి వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ముద్దులు పెట్టడం, చేతులతో దీవెనలు ఇవ్వడం కనిపించింది. ఇదంతా ఎన్నికల మాయ అంటూ స్థానికులు చర్చించుకోవడం కనిపించింది. కాగా, ఇటీవల అనంతపురం జిల్లాలో సీఎం జగన్‌పై గుర్తుతెలియని వ్యక్తి చెప్పు విసిరిన నేపథ్యంలో.. పోలీసులు సేఫ్టీగార్డులతో బస్సుపై సీఎం చుట్టూ రక్షణగా నిలిచారు.

- పుంగనూరు

అభివాదాలతో సరి

మౌనంగా సాగిన సీఎం జగన్ బస్సుయాత్ర

గంటలకొద్దీ ట్రాఫిక్ ఆపేయడంతో వాహనదారుల కష్టాలు



పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ సమీపంలో జగన్ రోడ్‌షోలో పాల్గొన్న కాలేజ్ విద్యార్థులు

కల్లూరు/సదుం/పుంగనూరు/పూతలపట్టు, ఏప్రిల్ 3: జిల్లాలో రెండోరోజైన బుధవారం సీఎం జగన్మోహన్‌రెడ్డి బస్సు యాత్ర అభివాదాలు, నమస్కారాలతో మౌనంగా సాగింది. సదుం సమీపంలోని అమ్మగారిపల్లెలో బస కేంద్రం నుంచి ఉదయం 10.15 గంటలకు బస్సుయాత్ర ప్రారంభమైంది. సదుం, కల్లూరు, దామలచెరువు, పూతలపట్టు మీదుగా బస్సు యాత్ర సాగినా ఎక్కడా ఆయన బస్సు దిగలేదు. బస్సులో నుంచే అభివాదం చేసుకుంటూ వెళ్లారు. ప్రజలతో మమేకం అవ్వడం, వారి సమస్యలు వినడం, వారికి హామీలు ఇవ్వడం వంటివి చేయలేదు. దీంతో వారంతా నిరాశ చెందారు. రంగంపేట క్రాస్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద కొంత మంది బస్సు నుంచి కిందకు దిగాలని నినాదాలు చేసి అడ్డంగా నిలబడ్డారు. జగన్ బస్సులో నుంచే పక్కకు జరగాలని సైగలు చేస్తూ ముందుకు వెళ్లడంతో వారంతా ఆగ్రహించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, స్థానిక నేతలు పాల్గొన్నారు.

బహిరంగ సభకు కాలేజీ విద్యార్థుల తరలింపు

మూర్తిగానిపూరు వద్ద ఏర్పాటు చేసిన జగన్ సభకు చిత్తూరులోని ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి వందలాది మంది విద్యార్థులను తరలించారు. కళాశాల వాహనాల్లో వీరంతా రావడం చూసిన జనం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సభకు భారీగా జనం వచ్చారని చూపేందుకు కాలేజీ విద్యార్థులను, కొన్ని ప్రాంతాల నుంచి పిల్లలను రప్పించారనే చర్చసాగింది.

మాస్కులు ధరించి పాల్గొన్న సంఘమిత్రలు

సీఎం జగన్ బస్సుయాత్రలో పలువురు సంఘమిత్రలు మాస్కులు వేసుకొని కనిపించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో తమను ఎవరూ గుర్తుపట్టకుండా మాస్కులు ధరించారు. జర్నలిస్టులను చూసిన పలువురు ముఖం చాటేశారు. రొంపిచెర్ల, పులిచెర్ల మండలం నుంచి పెద్ద ఎత్తున డ్వాక్రా మహిళలు ఆటోల్లో తరలిరావడంతో కల్లూరులో ఎక్కడచూసినా ఆటోలే కనిపించాయి.

ప్రయాణీకులకు సినిమా కష్టాలు

కల్లూరు ప్రాంతంలో పీలేరు- చిత్తూరు జాతీయ రహదారిపై సీఎం జగన్ బసుయాత్ర ఉండటంతో పోలీసులు ఇరుమార్గాల్లో వాహనాల రాకపోకలను ఆపేశారు. ఎంజీఆర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద రాకపోకలు అడ్డుకున్నారు. పీలేరు నుంచి కల్లూరు మీదుగా దామలచెరువు, పాటూరు, పూతలపట్టు, చిత్తూరుకు వెళ్లే వాహనాలను ఉదయం 10 గంటల నుంచి వాహనాలను సాయంత్రం 4.30 గంటల వరకు అనుమతించలేదు. ఎండలో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

- ఇక, పూతలపట్టు మండలం రంగంపేట క్రాస్ నుంచి పీలేరువైపు వెళ్లే రోడ్డును మధ్యాహ్నం 12.30 గంటల నుంచే పూర్తిగా మూసేశారు. స్థానికులనూ పోలీసులు అనుమతించలేదు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన భారీ వాహనాలూ ఆగిపోయాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల బస్సులను రంగంపేట క్రాస్ నుంచి వెనక్కి పంపేశారు. దూరప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



సీఎం సభకు తీసుకొచ్చిన ఆర్టీసీ బస్సులు







అమ్మవారి దర్శనం కోసం ఆలయ ఆవరణలో కిక్కిరిసిన భక్తులు - సుగుటూరు గంగమ్మకు గెరిగెలతో మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు - రాంపల్లె వద్ద గంగమ్మ ఊరేగింపు

ఘనంగా పుంగనూరు గంగజాతర

- గెరిగెలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

పుంగనూరు, ఏప్రిల్ 3: పుంగనూరులోని సుగుటూరు గంగమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. పట్టణం జన సంద్రంగా మారింది. వేలాదిమంది భక్తులు గెరిగెలు మోసి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. మంగళవారం రాత్రి పురవీధుల్లో ఘనంగా ఊరేగింపు పూర్తి చేసుకున్న అమ్మవారిని నిర్వాహకులు బుధవారం వేకువజామున జమిందారీ ప్యాలెస్‌లోని సుగుటూరు గంగమ్మ ఆలయంలో భక్తుల దర్శనం కోసం కొలువుదీర్చారు. తోటి కులస్తులు గంగమ్మకు జంతుబలులు సమర్పించిన అనంతరం ఆలయంలో పూజలు ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారి దర్శనం కోసం భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. పట్టణంలో ఎటు చూసినా భక్తజనమే. గంగమ్మ ఆలయంలోకి చేరుకోగానే బజారువీధిలో నడివీధి గంగమ్మను ఏర్పాటు చేసి పూజలు చేశారు. పుంగనూరు అష్టగంగమ్మలు నల్లరాళ్ల గంగమ్మ, మల్లారమ్మ, స్థలగంగమ్మ, మారెమ్మ, విరూపాక్షమ్మ ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజల్లో పాల్గొని భక్తులు మొక్కులు తీర్చుకోవడంతో ఆలయాలు కిక్కిరిశాయి. భక్తులు అమ్మవారికి టెంకాయలు, జంతుబలులు, పూలు, నిమ్మకాయలు, గెరిగెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. రాంపల్లె, శ్రీవిరూపాక్షి మారెమ్మ విగ్రహాలను చాందినీబండ్లపై ఏర్పాటు చేసి ఊరేగించారు. జాతర సందర్భంగా పట్టణంలో భారీగా మద్యం అమ్మకాలు జరగ్గా, కర్ణాటక మద్యం జోరుగా విందుల్లో కనిపించింది. అమ్మవారిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి , బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్, పుంగనూరు పరిసర ప్రాంతాల్లోని ప్రముఖులు, రాజకీయనాయకులు, అధికారులు, ప్రజలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేకాలంకరణలో సుగుటూరు గంగమ్మ

జీవన శైలి మార్పుతో ఆరోగ్యకర జీవితం





మాట్లాడుతున్న ప్రకృతివనం ప్రసాద్ - ర్యాంప్ వాక్‌లో పాల్గొన్న విద్యార్థినులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 3: జీవన శైలిలో మార్పులతో ఈ తరం ఆరోగ్యకర జీవనాన్ని సాగించవచ్చని ప్రకృతివనం వ్యవస్థాపకులు ప్రసాద్ పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలో విరించి-2కె24 కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. నగరీకరణ, సాంకేతికత మనిషి జీవితాన్ని గందరగోళానికి గురి చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. సక్రమ జీవన శైలికి ఈ అంశాలు మనిషిని దూరం చేస్తున్నాయని తెలిపారు. వ్యాయామంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. మనిషి ప్రకృతితో మమేకం కావాలన్నారు. పద్మావతి వర్సిటీ వీసీ ప్రొఫెసర్ భారతి మాట్లాడుతూ మన సంస్కృతిని కాపాడుకోవడంతో పాటు పాశ్చాత్య సంస్కృతికి దూరంగా ఉండాలని కోరారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రజని మాట్లాడుతూ విద్యార్థులు తమలోని ప్రతిభను ప్రదర్శించడానికి ఇదో చక్కని వేదిక అని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రారంభ సభ అనంతరం విద్యార్థులకు పలు ప్రతిభా పోటీలు నిర్వహించారు. నాట్యం, రంగోళి, పెయింటింగ్, మెహందీ, ర్యాంప్ వాక్ నిర్వహించారు. జెనిస్ (మిస్ విరించి), రోచనప్రియ (మిస్ స్మైల్), మహాలక్ష్మి (మిస్ ఎలిగెంట్)గా గెలుపొందారు.

ఎస్వీ పాలిటెక్నిక్‌లో కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 3: కేటీ రోడ్డులోని ఎస్వీ పాలిటెక్నిక్‌లో జాబ్ ఓరియెంటెడ్ కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథ రెడ్డి పేర్కొన్నారు. సమ్మర్‌క్యాంప్‌లో భాగంగా కంప్యూటర్ ఫండమెంటల్స్, ఆఫీస్ ఆటోమేషన్(ఎంఎస్ ఆఫీస్), డీటీపీ, ట్యాలీ, సి, సీప్లస్, వీబీ అండ్ ఒరాకిల్, జావా, హార్డ్‌వేర్, నెట్‌వర్కింగ్, మొబైల్ టెక్నాలజీ, ఆటోక్యాడ్, మల్టీమీడియా, పీజీ డిప్లొమా ఇన్ అడ్వాన్స్‌డ్ మల్టీమీడియా, యానిమేషన్, వెబ్ డిజైనింగ్ వంటి కోర్సులకు దరఖాస్తులు కోరుతున్నామని తెలిపారు. కనీస విద్యార్హత 7వ తరగతి ఉండాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9985129995, 7671887039లను సంప్రదించాలని కోరారు.

అట్టహాసంగా ఆయుష్మాన్ భవనం ప్రారంభం..

ఇంకా ఆరంభం కాని వైద్యసేవలు..!

- నెలరోజులు దాటినా తలుపులు తెరచుకోని కొత్తభవనం
- పాతభవనంలోనే వైద్యసేవలు
- ఇదీ సి.మల్లవరంలోని ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పరిస్థితి

తిరుపతి(రూరల్), ఏప్రిల్ 3: రూరల్ మండల పరిధిలో సి.మల్లవరం గ్రామంలో కొత్తగా నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ నెలరోజులుగా తెరచుకోకుండా మూతపడి ఉంది. గ్రామంలో రూ.17.5లక్షలతో నిర్మించిన ఈ కేంద్రాన్ని నెలరోజుల క్రితం తుడా ఛైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అట్టహాసంగా ప్రారంభించారు. నెలరోజులు దాటుతున్నా ఇప్పటికీ ఆకేంద్రం తలుపులు తెరుచుకోలేదు.. కొత్తగా నిర్మించిన ఈ ఆరోగ్యకేంద్రంలో రోగుల, వైద్యుల అవసరాలకు అనుగుణంగా సరైన సౌకర్యాలతో నిర్మాణం చేపట్టకపోవడం వల్లనే దానిలోకి అడుగుపెట్టలేని పరిస్థితికి కారణమని తెలుస్తోంది. రోగులకు అవసరమైన ఎగ్జామినేషన్ హాల్, మెడిసిన్స్, ల్యాబ్ పరికరాలు వంటివి పెట్టుకునేందుకు సైడుబండలు, రన్నింగ్‌వాటర్‌తో కూడిన సింకు వంటివి ఏర్పాటు చేయకపోవడంతో ఓల్డ్‌భవనంలో నుంచి కొత్తభవనంలోకి ఇంకా మార్పు చేయలేదని సమాచారం. పాత పంచాయతీ కార్యాలయంలో శిధిలావస్థకు చేరిన ఓచిన్న గదిలోనే ఇప్పటికీ ఈ ఆరోగ్య ఉపకేంద్రాన్ని నడుపుతున్నారు. చిన్నపాటి ఈగదిలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌తో పాటు వైద్యంకోసం వచ్చేవారిలో ఒకరికి మించి కూర్చోలేని ఇరుకైన పరిస్థితి. ఇక ఇరుకుగదిలోనే మందులు, లేబొరేటరీ పరికరాలు, ఇతరత్రా వస్తువులు వంటివాటిని అట్టపెట్టెలో సమకూర్చి నేలపైనే ఒకదానిపై మరొకటి అమర్చి ఉన్నారు. దీనికితోడు ఇప్పటికే ఈగదికి పైపెచ్చులు ఊడిపోయి రేపో..మాపో అనే స్థితికి చేరుకుంది. కాగా కొత్తగా నిర్మించిన కేంద్రంలో అవసరమైన మౌలిక సదుపాయాలను పూర్తిస్థాయిలో కల్పించకుండా అట్టహాసంగా ప్రారంభోత్సవం చేసి చేతులు దులుపుకోవడంపై గ్రామంలో చర్చ నడుస్తోంది. ఇప్పటికైనా నూతన కేంద్రానికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి త్వరితగతిన ఈకేంద్రంలో వైద్యసేవలను ప్రారంభించాలని పలువురు గ్రామస్తులు కోరుతుండడం గమనార్హం.



అట్టపెట్టెలో పెట్టుకున్న మెడిసిన్స్





పైపెచ్చులు ఊడిపోయి రేపో..మాపో అన్నట్లుగా ఉన్న పాతభవనం - నెలరోజులుగా మూతపడి ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్

ఒంటిపూట బడుల పనివేళలు కుదించాలి


తిరుపతి(విద్య), ఏప్రిల్3: ఎండల తీవ్రత నేపథ్యంలో ఒంటిపూట బడుల పనివేళలను ఉదయం 7.30నుంచి 11.30గంటల వరకు మాత్రమే నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ఏపీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాలాజి పేర్కొన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 37 నుంచి 43డిగ్రీల వరకు నమోదవుతున్నందున విద్యార్థులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదముందని తెలిపారు. అలాగే పాఠశాలలో మజ్జిగ పంపిణీ ఏర్పాట్లు చేయాలని కోరారు. వార్షిక పరీక్షలు ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12గంటల లోపు ముగించేలా షెడ్యూల్‌ను సవరించాలని పేర్కొన్నారు.

సంస్కృత వర్సిటీలో ఘనంగా హాస్టల్‌డే



తిరుపతిరూరల్, ఏప్రిల్ 3: జాతీయ సంస్కృత వర్సిటీలో బుధవారం హాస్టల్‌డేను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీకుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంగా చదువుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ఈ ఏడాది నుంచి కార్పస్ ఫండ్ క్రియేట్ చేసి ముందుకెళ్లేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఆర్‌జే రమాశ్రీ, చీఫ్ వార్డెన్ ప్రొఫెసర్ పి.వెంకట్రావు, వార్డెన్లు నల్లన్న, జేబీ చక్రవర్తి, అదెన్ననాయక్, లక్ష్మీనారాయణ, దత్తాత్రేయశర్మ, తపన్‌కుమార్, పరమిత పండా, జ్యోతి, వైష్ణవి, బుల్టీదాస్, మేనేజర్ ఫణివర్మ పాల్గొన్నారు.

ఖాదీకాలనీకి రోడ్డొచ్చింది



తిరుపతి, ఏప్రిల్3 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఖాదీకాలనీకి రోడ్డు వచ్చింది. రోడ్డు విస్తరణ పేరిట 7 నెలల క్రితం చేపట్టిన పనులు పూర్తికాకపోవడంతో అటుగా వెళ్లే వారు దారిలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీనిపై గత ఆదివారం 'రోడ్డు నవ్వుతోంది 'మాస్టర్' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై మున్సిపల్ కార్పొరేషన్ స్పందించింది. కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి రెండు రోజుల్లో ఆగమేఘాలమీద రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు. దీంతో అటుగా వెళ్లే వాహనదారులకు రాకపోకలు సులభతరమయ్యాయి.

తెలుగులో ఫామ్ 26...

» వివరాలు సమర్పించండి

» కేంద్ర ఎన్నికల సంఘానికి హైకోర్టు ఆదేశం

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించిన అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌ను(ఫామ్-26) తెలుగులో అందుబాటులో ఉంచే అంశంపై వివరాలు సమర్పించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని హైకోర్టు ఆదేశించింది. విచారణను మే మొదటి వారానికి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. క్రిమినల్ కేసులు, ఆస్తులకు సంబంధించి అభ్యర్థులు సమర్పించే అఫిడవిట్‌ను(ఫామ్-26) తెలుగులో అందుబాటులోకి ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ విజయవాడకు చెందిన ఎస్ రమేష్‌బాబు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదనలు వినిపిస్తూ... అభ్యర్థులపై ఉన్న క్రిమినల్ కేసులు, ఆస్తుల వివరాలు అన్నింటినీ తెలుగు పత్రికలు, ప్రసారమాధ్యమాల ద్వారా ప్రజలకు తెలియజేసేలా ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులను ఆదేశించాలని కోరారు. అభ్యర్థులు సమర్పించే ఫామ్-26 అఫిడవిట్‌లను తెలుగులో అందుబాటులో ఉంచేలా ఈసీని ఆదేశించాలని కోరారు.

అప్పులు తెచ్చి అస్మదీయులకు పంపిణీ: సీపీఐ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) హెచ్చరికలను సైతం లెక్క చేయకుండా జగన్ సర్కారు అప్పులు తెస్తూ... తన అస్మదీయులకు పంచిపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ బుధవారం విమర్శించారు. 'ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రతి నెలా 1న జీతాలు, పెన్షన్లు చెల్లించేందుకు కూడా అప్పులు వెదకాల్సిన దుస్థితి. ఉద్యోగులకు దాదాపు రూ.32వేల కోట్లు బకాయిలు చెల్లించాలి. ఉద్యోగులను విస్మరించి, తెచ్చిన అప్పులను అస్మదీయులకు చెల్లించడం దుర్మార్గం. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్తులతోపాటు వివిధ పద్ధతుల్లో తీసుకువచ్చిన అప్పులు మొత్తం కలిపి రాష్ట్ర ప్రభుత్వ అప్పు రూ.10 లక్షల కోట్లు దాటింది. ఎఫ్ఆర్ఎంబీ రుణ పరిమితికి మించి అప్పులు చేస్తుండటం రాష్ట్ర ప్రభుత్వ తిరోగమన విధానాలకు నిదర్శనం. జగన్ సర్కార్ ఇప్పటి వరకు చేసిన రూ.14,500 కోట్ల చెల్లింపులపై సమగ్ర విచారణ జరపాలి. ప్రజలంతా జగన్మాయలను గమనించి ఎన్నికల్లో ఓట్లు వేయాలి' అని రామకృష్ణ కోరారు.

నేటి నుంచి కృష్ణా తూర్పు, పశ్చిమ డెల్టాకు తాగునీటి విడుదల

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది తూర్పు, పశ్చిమ డెల్టాకు గురువారం నుంచి తాగునీటి విడుదల చేస్తున్నామని జిల్లా కలెక్టర్లకు రాష్ట్ర జలవనరుల శాఖ సమాచారమిచ్చింది. ఏలూరు, కృష్ణా, ఎన్‌టీఆర్, కృష్ణా, గుంటూరు, కృష్ణా తూర్పు, కృష్ణా పశ్చిమ డెల్టా, గుంటూరు చానల్ ద్వారా పులిచింతల నుంచి నీటిని విడుదల చేస్తున్నామని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వు జారీ చేశారు. గురువారం నుంచి ఈ నెల 10వ తేదీ దాకా తాగునీటి విడుదల చేస్తున్నందున కాలువల్లో నీటి ప్రవాహాలు సక్రమంగా సాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

యాపిల్ యూజర్లకు కేంద్రం 'హైరిస్క్' అలర్ట్

» హ్యాకింగ్ బారిన పడకుండా అప్‌డేట్ చేసుకోవాలని సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: యాపిల్ వినియోగదారులకు కేంద్రం హైరిస్క్ అలర్ట్‌ను జారీ చేసింది. ఐఫోన్, మ్యాక్‌బుక్, ఐప్యాడ్, విజన్ ప్రో హెడ్‌సెట్ వంటి యాపిల్ ఉత్పత్తులకు రిమోట్ కోడ్ ఎగ్జిక్యూషన్‌కు సంబంధించిన భద్రతాపరమైన ముప్పు ఉందని కేంద్ర ప్రభుత్వ సెక్యూరిటీ సంస్థ- కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్(సెర్ట్-ఇన్) వెల్లడించింది. దీని వల్ల యూజర్లకు ప్రమాదం పొంచి ఉందని, హ్యాకింగ్‌కు గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపింది. కాబట్టి లేటెస్ట్ సెక్యూరిటీ వెర్షన్స్‌తో అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

రాక్షస పాలనకు రోజులు దగ్గరపడ్డాయి.!

» జబర్దస్త్ కమెడియన్ రాంప్రసాద్

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 3: రాష్ట్రంలో రాక్షస పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని జబర్దస్త్ కమెడియన్ రాంప్రసాద్ (ఆర్‌పీ) పేర్కొన్నారు. బుధవారం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో నిర్వహించిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా విలేకరులతో కాసేపు ముచ్చటించారు. నెల్లూరు ఎంపీగా పోటీచేస్తున్న కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి అసెంబ్లీ కూటమి అభ్యర్థి కాకర్ల సురేష్ సేవాగుణం కలవారని తెలిపారు. అలాంటి వారిని గెలిపించుకుంటే మన పిల్లల భవిష్యత్తు బాగుంటుందన్నారు. వేసవిలో ఎండల కంటే వైసీపీ ప్రభుత్వం ప్రమాదకరమైందని, వైసీపీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆర్‌పీ పిలుపునిచ్చారు.

హిందూజా వేరియబుల్ కాస్ట్ పెంపు!

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం హిందూజా నేషనల్ పవర్ ప్రాజెక్టు విద్యుదుత్పత్తిలో వేరియబుల్ వ్యయం రూ.3.03నుంచి రూ.3.16కు పెంచుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు నియంత్రణ మండలి ఆదేశించింది. ఈ మేరకు బుధవారం ఆ ఆదేశాలను వెబ్‌సైట్‌లో పొందుపరచింది.

ఇద్దరి అవయవదానం.. నలుగురికి వెలుగులు

అక్కిరెడ్డిపాలెం(విశాఖపట్నం), ఏప్రిల్ 3: వేర్వేరు ప్రమాదాల్లో గాయపడి బ్రెయిన్‌డెడ్ అయిన ఇద్దరి అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. విశాఖలోని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రిలో మంగళవారం వీరిద్దరి అవయవాలను సేకరించారు. జీవన్‌దాన్ వైద్య అధికారులు, కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి వైద్యులు బుధవారం తెలిపిన వివరాలు.. విశాఖలోని సీతమ్మపేటకు చెందిన బీఎస్‌వీ కృష్ణ (50) ఒక జ్యువెలరీ దుకాణంలో అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. గత నెల 29వ తేదీన విధుల్లో భాగంగా రాజమహేంద్రవరం వెళ్లి కారులో తిరిగి వస్తుండగా ఎలమంచిలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు తీవ్రగాయమైంది. చికిత్స నిమిత్తం షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించారు. అయితే, కృష్ణ బ్రెయిన్‌డెడ్ కావడంతో మంగళవారం ఆయన కుటుంబసభ్యుల అంగీకారం మేరకు ఊపిరితిత్తులను సేకరించిన జీవన్‌దాన్ వైద్య సిబ్బంది వాటిని హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి గ్రీన్‌చానల్ ద్వారా తరలించారు. అలాగే తూర్పు గోదావరి జిల్లా నల్లజర్లకు చెందిన కొవ్వూరి రాణి (50) గత నెల 29వ తేదీన ద్విచక్ర వాహనంపై నుంచి పడిపోవడంతో తలకు తీవ్రగాయమైంది. చికిత్స కోసం రాజమహేంద్రవరంలోని ఓ ఆసుపత్రిలో చేర్చగా...అక్కడ నుంచి షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆసుపత్రికి తరలించారు. రాణికి బ్రెయిన్‌డెడ్ అయినట్టు గుర్తించిన వైద్యులు ఆ విషయం కుటుంబసభ్యులకు తెలపగా.. అవయవదానానికి అంగీకారం తెలిపారు. రాణి కిడ్నీ, గుండె, ఊపిరితిత్తులను సేకరించారు. కృష్ణ, రాణి అవయవాలను జీవన్‌దాన్‌లో నమోదు చేసుకున్న నలుగురికి అమర్చినట్టు వైద్యులు తెలిపారు.

అసంతృప్తులకు లోకేశ్ బుజ్జగింపు

» టీడీపీ ప్రభుత్వంలో ప్రాధాన్యమిస్తామని హామీ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): జనసేన, బీజేపీ అభ్యర్థులు పోటీ చేసే చోట వారి గెలుపు కోసం కృషి చేయాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ తమ పార్టీ నేతలను కోరారు. ఎన్నికల్లో సీటు ఆశించి, భంగపడ్డ అసంతృప్త నేతలతో ఆయన బుధవారం భేటీ అయ్యారు. అసంతృప్త నేతల్ని బుజ్జగించారు. వారి రాజకీయ భవిష్యత్‌కు భరోసా ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వంలో తగు ప్రాధాన్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. లోకేశ్ హామీతో నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనను కలిసినవారిలో కిమిడి నాగార్జున, కోరాడ రాజబాబు, బంగార్రాజు, ఎమ్మెస్ రాజు, జగన్మోహన్‌రాజు, నాగూల్ మీరా, మాధవనాయుడు తదితరులు ఉన్నారు.

విశాఖలో వైసీపీ తాయిలాలు

» ఓటర్లకు రైస్ కుక్కర్లు ఫ్లైయింగ్ స్క్వాడ్ దాడులు

» కవర్ చేయడానికి వెళ్లిన మీడియా ప్రతినిధులపై దాడి

విశాఖపట్నం, ఏప్రిల్ 3: విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం పరిధిలోని 22వ వార్డు తారామసీదు ఏరియాలో బుధవారం రాత్రి వైసీపీ నాయకులు రైస్‌కుక్కర్లు పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆటోల్లో గంగ బ్రాండ్ రైస్ కుక్కర్లను (5.5 లీటర్స్) తీసుకొచ్చి రోడ్డుపై దింపారు. ఈ సమాచారం ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు అందడంతో అక్కడకు చేరుకుని రైస్‌కుక్కర్లను స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీస్తున్న మీడియా ప్రతినిధులను వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. 'ఈనాడు', 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' ప్రతినిధులపై దాడి చేసి కెమెరాలు లాక్కున్నారు. దీంతో దాడులు చేసిన వారిని పోలీసులు చెదరగొట్టారు.

ఆప్‌ను నేలమట్టం చేసే కుట్ర

ఎన్నికలకు ముందే ఆ పని చేయాలని కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు

» ఢిల్లీ హైకోర్టులో అభిషేక్ సింఘ్వీ వాదనలు

» ఆయన పాత్రపై ఆధారాలున్నాయి: ఈడీ

» తీర్పు రిజర్వు చేసిన న్యాయమూర్తి



బుధవారం తిహాడ్ జైలు నుంచి బయటకు వస్తున్న ఆప్ నేత సంజయ్‌సింగ్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందే ఆమ్ ఆద్మీ పార్టీని (ఆప్‌ను) నేలమట్టం చేయాలనే దురుద్దేశంతోనే తనను అరెస్టు చేశారని ఆ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టులో బుధవారం సుదీర్ఘంగా వాదనలు జరిగాయి. పిటిషన్‌ను ఈడీ తీవ్రంగా వ్యతిరేకించింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వు చేశారు. అంతకుముందు కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపించారు. ఆప్‌ను సర్వనాశనం చేసి ఢిల్లీలోని ఏడు లోక్‌సభ సీట్లలో విజయం సాధించాలనే లక్ష్యంలో భాగంగానే కేజ్రీవాల్‌ను కేంద్రంలోని బీజేపీ సర్కార్ అరెస్టు చేయించిందని ఆరోపించారు. ఈ మేరకు, పోలింగ్ రోజు తొలి ఓటు పడటానికి ముందే ఆప్‌ను నేలమట్టం చేయడం ఈడీ ఉద్దేశమన్నారు. ఎన్నికలకు ముందు ఒక పార్టీ అధినేతను, ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం సరైంది కాదని, ఎన్నికల్లో అందరికీ సమానావకాశాలు కల్పించాలనే ప్రజాస్వామ్య మూలసూత్రాలను ఇది కాలరాస్తుందని సింఘ్వీ చెప్పారు. కేజ్రీవాల్ నుంచి స్టేట్‌మెంట్ తీసుకునేందుకు ఎలాంటి అడ్డంకులు లేవని, కానీ, దీనికోసం ఈడీ ఒక్కసారి కూడా ప్రయత్నించకుండా ఏకంగా అరెస్టు చేసిందని గుర్తు చేశారు. కొందర్ని అరెస్టు చేసి ఒత్తిడి తెచ్చి వారి నుంచి తమకు కావలసిన విధంగా ప్రకటనలు ఇప్పిస్తారని, అనంతరం వారికి బెయిల్ వచ్చేలా చూస్తారని, ఆ తర్వాత వారు అప్రూవర్లుగా మారేందుకు అంగీకరిస్తారని తెలిపారు. ఈ కేసులో అప్రూవర్లుగా మారిన వారిలో ఇద్దరికి బీజేపీతో ప్రత్యక్ష సంబంధాలున్నాయని, ఒకరు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని సింఘ్వీ తెలిపారు. ఈడీ తరఫున అడిషనల్ సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ) ఎస్వీ రాజు వాదనలు వినిపిస్తూ.. కేజ్రీవాల్ ఢిల్లీ మద్యం కేసులో ప్రధాన కుట్రదారని, ఆయన మనీలాండరింగ్‌కు పాల్పడినట్లు సాక్ష్యాలు ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో సీఎంను అరెస్టు చేయటమేమిటన్న వాదనను వ్యతిరేకిస్తూ.. ఒక రాజకీయ నాయకుడు ఎన్నికల ముందు హత్య చేసి తనను అరెస్టు చేయకూడదంటే అంగీకరిస్తామా అని ప్రశ్నించారు. ఒక ఉగ్రవాది ఆర్మీ వాహనాన్ని పేల్చి వేసి, ఎన్నికల్లో పోటీ పడుతున్నా కాబట్టి నన్నేమీ అనొద్దు అంటే ఊరుకుంటామా అని పేర్కొన్నారు. దీనికి సింఘ్వీ అభ్యంతరం తెలుపుతూ.. ఈ కేసుకు సంబంధం లేని విచిత్రమైన పోలికలు తెస్తున్నారని, మద్యం కేసులో కేజ్రీవాల్ అక్రమ లావాదేవీలకు పాల్పడినట్లు ఇంతవరకూ ఈడీ ఒక్క సాక్ష్యమూ సంపాదించలేదని గుర్తుచేశారు. ఏఎస్‌జీ వాదనలు కొనసాగిస్తూ.. మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్ పాత్రపై దర్యాప్తు ప్రాథమిక దశలోనే ఉన్నదని, అయితే, డబ్బులు చేతులు మారినట్లు తాము గుర్తించామని తెలిపారు. కుంభకోణం జరిగిందని, లాభాల వాటా శాతాన్ని పెంచి ముడుపులకు ఉపయోగించారని, హవాలా మార్గంలో ఎన్నికల సమయంలో డబ్బులు పంపారని పేర్కొన్నారు. ఈ మేరకు తమ వద్ద వాట్సాప్ చాట్‌లు, హవాలా ఆపరేటర్లు వెల్లడించిన వివరాలు ఉన్నాయన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వు చేశారు. మరోవైపు, టీ, నీళ్లు కాచుకోవటానికి ఒక ఎలక్ట్రిక్ కెటిల్, పుస్తకాలు చదువుకోవటానికి కుర్చీ, టేబుల్ కావాలన్న కేజ్రీవాల్ విజ్ఞప్తికి ఢిల్లీలోని స్థానిక కోర్టు అంగీకరించి, వాటిని సమకూర్చాలని తీహాడ్ జైలు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కాగా, బుధవారం ఉదయం తన గదిని కేజ్రీవాల్ చీపురుతో స్వయంగా శుభ్రం చేసుకున్నారని జైలు అధికారవర్గాలు తెలిపాయి.

కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తోంది: ఆప్

అరెస్టు అనంతరం కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్నదని, ఆయన ఇప్పటికే 4.5 కిలోల బరువు తగ్గిపోయారని ఆప్ ఆందోళన వ్యక్తం చేసింది. తీవ్రమైన మధుమేహం సమస్యతో ఉన్న కేజ్రీవాల్‌ను జైలు పాలు చేసి ఆయన ప్రాణాలతో బీజేపీ చెలగాటమాడుతున్నదని ఆరోపించింది. ఈ మేరకు ఆప్ నేత, ఢిల్లీ మంత్రి ఆతిషీ బుధవారం మీడియాతో మాట్లాడారు. 'తీవ్రమైన మధుమేహం ఉన్న వారిలో షుగర్ లెవల్ 50 ఎంజీ/డీఎల్ కన్నా తగ్గితే అది అత్యంత ఆందోళనకరం. ఈడీ కస్టడీలో ఉన్నప్పుడే కేజ్రీవాల్ షుగర్ లెవల్స్ మూడుసార్లు పడిపోయాయి. ఒకసారి ఏకంగా 46 ఎంజీ/డీఎల్‌కు తగ్గిపోయింది. గత 12 రోజుల్లో కేజ్రీవాల్ 4.5 కిలోల బరువు తగ్గారు' అని తెలిపారు. కేజ్రీవాల్‌కు ఏమైనా జరిగితే బీజేపీ వాళ్లను యావత్ దేశం మాత్రమే కాదు, దేవుడు కూడా క్షమించడన్నారు. అయితే, సోమవారం తీహాడ్ జైలుకు వచ్చినప్పటి నుంచీ కేజ్రీవాల్ బరువు స్థిరంగా 65 వద్దే కొనసాగుతుందని, ఆయన ఆరోగ్యంగా ఉన్నారని, ఇద్దరు డాక్టర్లు కూడా ఆయనను పరీక్షించారని జైలు అధికారయంత్రాంగం బుధవారం ప్రకటన విడుదల చేసింది. కాగా, కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఈ నెల 7వ తేదీన ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆప్ సమష్టి నిరాహారదీక్షను చేపట్టనున్నట్లు ప్రకటించింది. దీనికి దేశవ్యాప్తంగా ప్రజలు సంఘీభావం తెలపాలని పిలుపునిచ్చింది. మంగళవారం బెయిల్ మీద జైలు నుంచి విడుదలైన ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ, త్వరలో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియా తదితర ఆప్ నేతలు కూడా విడుదలవుతారని ఆశిస్తున్నానని పేర్కొంటూ.. తీహార్ జైలు తాళాలు త్వరలో తెగిపడతాయని పేర్కొన్నారు.

ఆతిశీకి బీజేపీ పరువునష్టం నోటీసులు

ఈడీ అరెస్టు నుంచి తప్పించుకోవాలంటే బీజేపీలో చేరాలంటూ తనకు ఆఫర్ వచ్చిందని, ఈ మేరకు ఓ వ్యక్తి ద్వారా ఆ పార్టీ రాయబారం పంపిందని ఆతిశీ చేసిన ఆరోపణలపై బీజేపీ పరువునష్టం నోటీసులు పంపించింది. తప్పుడు వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది.

వీవీ ప్యాట్లపై వచ్చే వారం విచారిస్తాం

» ఈ విచారణ ఎంతో అత్యవసరం

» స్పష్టం చేసిన సుప్రీం ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వీవీ ప్యాట్ల అంశంపై విచారణ చేపట్టడం ఎంతో అత్యవసరమని తమకు తెలుసని, దీనిపై వచ్చేవారం తప్పకుండా విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్(ఈవీఎం) కౌంటింగ్ మాత్రమే కాకుండా ఓటర్ వెరిఫియబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్(వీవీపాట్)లను సైతం లెక్కించిన తర్వాతే విజేతను ప్రకటించాలని కోరుతూ అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1) (ఎ), 21 ప్రకారం వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక హక్కుల్లో భాగం. 2013లో సుబ్రమణియన్ స్వామి వర్సెస్ భారత ఎన్నికల సంఘం కోర్టు ఆదేశాలతో ఓటరు తాను ఏ అభ్యర్థికి ఓటు వేశారో తెలుసుకునే హక్కును పొందారు. కాబట్టి ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంల కౌంటింగ్ మాత్రమే కాకుండా వీవీ ప్యాట్‌లను సైతం లెక్కించి విజేతను ప్రకటించాలి' అని ఏడీఆర్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై బుధవారమే విచారణ జరగాల్సి ఉంది. అయితే.. జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పెషల్ బెంచ్‌కు నేతృత్వం వహిస్తుండడంతో అది బుధవారం బెంచ్ మీదకు రాలేదు. ఈ క్రమంలో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ ప్రత్యేకంగా ధర్మాసనం ముందు ఈ విషయాన్ని ప్రస్తావించారు. పిటిషన్‌ను త్వరగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. పిటిషన్‌ను వచ్చే వారంలో విచారిస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ క్రమంలో మరో ఇద్దరు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ప్రశాంత్ భూషణ్, గోపాల్ శంకర్ నారాయణన్ కలుగజేసుకుని ఎన్నికలు దగ్గర పడుతున్నాయని, ఆలస్యమైతే పిటిషన్ దాఖలు చేసి కూడా వృథా అవుతుందని, అందువల్ల వీలైనంత త్వరగా విచారించాలని విజ్ఞప్తి చేశారు. అయితే.. పరిస్థితి తమకు తెలుసని, వచ్చేవారం తప్పకుండా విచారణ చేపడతామని జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు.

రోగం రోగికా?.. ఆస్పత్రికా!?

» రాజమహేంద్రవరం ఆసుపత్రిలో ఇదీ తీరు



ఈ ఫొటో చూస్తుంటే రోగం రోగికా? లేక ఆస్పత్రికా?.. అనే సందేహం వస్తుందా?.. నిజమే మరి..! జగన్ జమానాలో ప్రభుత్వాస్పత్రులకు పట్టిన పీడకు ఈ ఫొటో అద్దం పడుతోంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో బుధవారం ఓ రోగి కుడి చేతికి సెలైన్ సూది (క్యానిలా) పెట్టారు. ఎడమ చేతిలో ఆ సెలైన్ బాటిల్ పెట్టారు. చేతికి ఏవో కాగితాలు ఇచ్చారు. వాటిని పట్టుకొని పాపం ఆ రోగి తన బెడ్ ఎక్కడ అంటూ తిరుగుతున్నా ఫలితం లేకపోయింది. సిబ్బంది ఎవరూ అతడిని పట్టించుకోలేదు. ఆ సమయంలో ఇలా బేలగా చూస్తూ 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంటపడ్డారు.

-రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

సత్యసాయి ఆంగ్ల అనువాదకులు ప్రొఫెసర్ అనిల్‌కుమార్ కన్నుమూత



పుట్టపర్తి, ఏప్రిల్ 3: పుట్టపర్తి సత్యసాయి బాబా ఆధ్యాత్మిక ప్రసంగ అనువాదకులు ప్రొఫెసర్ అనిల్‌కుమార్ (82) అనారోగ్యంతో బుధవారం కన్నుమూశారు. ఆయన శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని శ్రీసత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు భగవాన్ సత్యసాయికి అత్యంత సన్నిహితంగా మెలిగారు. సత్యసాయి ప్రసంగాలను ఆంగ్లంలోకి అనువదించేవారు. పుట్టపర్తిలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.

బీజేపీలో చేరుతున్నా: సుమలత

మండ్య, ఏప్రిల్ 3: సినీనటి, కర్ణాటకలోని మండ్య నియోజకవర్గ స్వతంత్ర ఎంపీ సుమలతా అంబరీశ్ బీజేపీలో చేరనున్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఆ నియోజకవర్గం నుంచి ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బరిలో ఉన్న జేడీఎస్ నేత హెచ్‌డీ కుమారస్వామికి ఆమె మద్దతు ప్రకటించారు. బుధవారం తన మద్దతుదారులతో సమావేశమైన ఆమె ఈ విషయాలను వెల్లడించారు. 'నేను మండ్యను వీడి ఎక్కడికీ వెళ్లను. రానున్న రోజుల్లోనూ మీకోసం ఇక్కడే పనిచేస్తాను. బీజేపీలో చేరాలని నేను నిర్ణయించుకున్నా' అన్నారు. తాను స్వతంత్ర ఎంపీని అయినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తన నియోజకవర్గానికి రూ.4వేల కోట్ల వరకూ గ్రాంట్లు ఇచ్చిందని, మండ్యకు సంబంధించిన ఏ నిర్ణయంలోనైనా బీజేపీ నేతలు తనను విశ్వాసంలోకి తీసుకొంటున్నారని తెలిపారు. 'బీజేపీకి నీ అవసరం ఉందని ప్రధానమంత్రి చెప్పారు. ఆయన మాటను నేను గౌరవించాల్సి ఉంది' అన్నారు. 'నేను కాంగ్రెస్‌లో చేరాలని కొంతమంది కోరారు. అయితే, సుమలత అవసరం ఉందని పార్టీ భావించడం లేదని సీనియర్ కాంగ్రెస్ నేత ఒకరు చెప్పారు. ఈ మాటలు విన్నాక ఆత్మగౌరవం ఉన్న వ్యక్తులు కాంగ్రెస్‌లోకి ఎలా వెళ్లగలరు?' అంటూ సుమలత భావోద్వేగానికి గురయ్యారు.

హింస రహితంగా ఎన్నికల నిర్వహణ లక్ష్యం

» స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించాలి

» భారత ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్

» ఢిల్లీ నుంచి వీడియో సమావేశం



కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్, సీఈవో, డీజీపీ

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా, హింసారహితంగా నిర్వహించడమే లక్ష్యంగా పని చేయాలని భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల యంత్రాంగానికి స్పష్టం చేశారు. లోక్‌సభ, వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి శాంతి భద్రతలు, భద్రతా బలగాల మోహరింపు, ఎన్నికల వ్యయ నిర్వహణ, నోడల్ అధికారుల నియామకం తదితర అంశాలపై బుధవారం ఢిల్లీ నుంచి సహచర ఎన్నికల కమిషనర్లతో కలిసి ఆయన వివిధ రాష్ట్రాల సీఎస్‌లు, డీజీపీలు, సీఈవోలు తదితర అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈసీ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలోనే పురాతన అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ఈసారి ఎన్నికలు ఏ విధంగా జరుగుతాయోనని ప్రపంచ దేశాలన్నీ మన వైపు చూస్తున్నాయన్నారు. ఇప్పటికే మొదటి, రెండవ దశ ఎన్నికలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయని, డబ్బు, మద్యం, డ్రగ్స్ వంటివి ఓటర్లను ప్రభావితం చేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలెన్స్ బందాలు ఎక్కడైనా తనిఖీల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అలాంటి బృందాలపై జిల్లా యంత్రాంగాలు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓటర్లు స్వేచ్ఛగా వచ్చి, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునే ప్రశాంతమైన వాతావరణాన్ని పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. మన రాష్ట్రం నుంచి సీఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల షెడ్యూల్ వెలువడినప్పటి నుంచి ఎన్నికల ప్రవర్తన నియమావళి కట్టుదిట్టంగా అమలుపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి ఇప్పటి వరకు రూ.258 కోట్ల విలువైన నగదు, మద్యం, డ్రగ్స్ తదితరాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఏపీతో ఐదు రాష్ట్రాలు అంతర్ రాష్ట్ర సరిహద్దులను కలిగి ఉన్నాయని, రాష్ట్ర సరిహద్దుల్లో 150 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని తెలిపారు. రాష్ట్రంలో 132 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు, 632 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పని చేస్తున్నాయని వివరించారు. డీజీపీ రాజేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ.. సరిహద్దు రాష్ట్రాలైన ఒడిసా, ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న 91 పోలింగ్ కేంద్రాలను గుర్తించి కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల మహారాష్ట్రకు 10 కంపెనీల పోలీసు బలగాలను పంపామని, వాటిని తిరిగి పంపాలని కోరారు. కాగా, శాంతిభద్రతలు, వ్యయ పర్యవేక్షణకు సంబంధించి పలు ఆదేశాలను సీఈసీ జారీ చేసింది.

శాంతిభద్రతలపై ఆదేశాలు ఇవీ..

- అంతర్జాతీయ, అంతర్ రాష్ట్ర సరిహద్దుల వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలి.
- నేరస్థులు, సంఘ విద్రోహ శక్తులపై నిఘా సమాచారాన్ని సరిహద్దు జిల్లాల మధ్య పంచుకోవాలి.
- సరిహద్దు జిల్లాల రెగ్యులర్ అంతర్-రాష్ట్ర సమన్వయ సమావేశాలు నిర్వహించాలి.
- పోలింగ్ రోజున అంతర్ రాష్ట్ర సరిహద్దులను మూసి వేయాలి.
- లైసెన్స్ పొందిన ఆయుధాలను సకాలంలో డిపాజిట్ చేయడం, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలు
- పరారీలో ఉన్న హిస్టరీ షీటర్లు, ఎన్నికల నేరాలకు పాల్పడిన నేరస్థులపై చర్యలు.
- ముప్పు అవగాహన ఆధారంగా రాజకీయ కార్యకర్తలు, అభ్యర్థులకు తగిన భద్రత కల్పించడం.

వ్యయ పర్యవేక్షణపై ఆదేశాలు ఇవీ...

- అంతర్ రాష్ట్ర , అంతర్జాతీయ సరిహద్దుల వెంబడి అక్రమ మద్యం, నగదు, డ్రగ్స్ ప్రవాహాన్ని అరికట్టడం
- సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో చెక్ పోస్టుల వద్ద పర్యవేక్షణను బలోపేతం చేయడం.
- పోలీసు, ఎక్సైజ్, రవాణా, జీఎస్టీ, అటవీశాఖల సంయుక్త తనిఖీ ఆపరేషన్లు చేయడం.
- హెలిప్యాడ్‌లు, విమానాశ్రయాలు, బస్ స్టేషన్లు రైల్వే స్టేషన్లపై గట్టి నిఘా.
- మద్యం, నగదు, డ్రగ్స్, తాయిలాల రవాణాను అడ్డుకునేందుకు గట్టి నిఘా.

అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో.. ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్-2024లో శ్రీచైతన్య వరుసగా పదకొండోసారి వరల్డ్ చాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీలో మొత్తం 28కి పైగా దేశాలు పాల్గొనగా అందులో తమ సంస్థ విద్యార్థులు నంబర్ వన్ స్థానంలో నిలిచారని శ్రీచైతన్య డైరెక్టర్ సీమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కాంటెస్ట్‌లో 3 క్యాష్ అవార్డులను ఎన్ఎస్ఎస్ ప్రకటించగా అందులో 2 అవార్డులను వరుసగా రెండో సంవత్సరం కూడా శ్రీచైతన్య సాధించిందని తెలిపారు. ఇప్పటి వరకు ఈ ఘనతను ఎవరూ సాధించలేదని పేర్కొన్నారు. అలాగే వరల్డ్ ఒకటి, రెండు, మూడు ప్రైజ్‌లలో గానీ, విన్నింగ్ ప్రాజెక్టుల సంఖ్యలో, విజయం సాధించిన విద్యార్థుల సంఖ్యలో, క్యాష్ అవార్డుల్లో గానీ భారతదేశంతోపాటు ప్రపంచంలోనే మరే ఇతర విద్యా సంస్థ తమ సంస్థ ఫలితాలకు దరిదాపుల్లోలేదని ఆమె తెలిపారు. ఈ ఫలితాలే శ్రీ చైతన్య స్కూల్‌ను ప్రపంచంలోనే నంబర్ 1గా నిలిపాయన్నారు.

అమెరికా ఎన్ఎస్ఎస్ స్పేస్ కాంటెస్ట్‌లో... 34 ప్రాజెక్టులతో నారాయణ గ్లోబల్ లీడర్

అమెరికా నాసా ప్రోత్సహించిన నేషనల్ స్పేస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గెరార్డ్ కె. ఓ నీల్ స్పేస్ సెటిల్‌మెంట్ కాంటెస్ట్-2024లో తమ సంస్థ విద్యార్థులు సత్తా చాటారని నారాయణ విద్యా సంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు సింధూర నారాయణ, శరణి నారాయణలు ఓ ప్రకటనలో తెలిపారు. సైన్స్ ప్రాజెక్టులో వరల్డ్ నంబర్ 1 స్థానంలో 2 సెలక్షన్స్ తమ విద్యార్థులు దక్కించుకున్నట్లు పేర్కొన్నారు. ఇండియాలో మరే ఇతర విద్యా సంస్థ ఇలాంటి అరుదైన రికార్డును సాధించలేదన్నారు. ఈ కాంటెస్ట్‌లో మొత్తంగా 34 ప్రాజెక్టుల్లో విజయ కేతనం ఎగురవేసినట్లు తెలిపారు. ఈ ఘన విజయంతో రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ, అంతర్జాతీయ స్థాయిలోనూ నారాయణ విద్యార్థులు విజయప్రస్థానం అప్రతిహతంగా కొనసాగుతుందని తెలిపారు. గత 11 సంవత్సరాలుగా అద్భుత ఫలితాలను సాధిస్తూ ఇప్పటి వరకు 334కు పైగా ప్రాజెక్టులను గెలుచుకుని వరల్డ్ నంబర్ వన్ స్కూల్‌గా నారాయణ మళ్లీ నిరూపించుకుందని చెప్పారు.

కమీషన్ల రూపంలో కోట్లు!

» దండుకున్న టీటీడీ చైర్మన్

» రాజకీయ పునరావాస కేంద్రంగా తిరుమల

» ఈవోను పదవి నుంచి తొలగించాలి: బీజేపీ

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 3: టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి కమీషన్ల రూపంలో కోట్లు దండుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా చైర్మన్ గత ఎనిమిది నెలలకాలంలో తిరుమలను రాజకీయ పునరావాస కేంద్రంగా మార్చేశారన్నారు. రూ.1,500 కోట్లు ఇంజనీరింగ్ శాఖకు కేటాయించి, సివిల్ పనులకు 10శాతం, రోడ్డు పనులకు 15శాతం కమీషన్ చైర్మన్‌కు ఇస్తే తప్ప పనులు ముందుకు వెళ్లడం లేదన్నారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి సత్రాలకు ఇంకా 15ఏళ్ల పాటు జీవితకాలం ఉన్నప్పటికీ, రూ.50కోట్ల కమీషన్‌కు కక్కుర్తి పడి ఆ సత్రాలను తొలగించారన్నారు. అత్తసొమ్ము అల్లుడి దానంలా రూ.180 కోట్లు టీటీడీ నిధులను రోడ్లపై ఖర్చు పెట్టారని విమర్శించారు. టీటీడీ ఈవో అధికార పార్టీకి సేవలు చేస్తున్నారని, దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఇంకా ఆరువారాల పాటు ఈవో సేవలు అవసరమంటూ కేంద్రానికి సీఎం జగన్ లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో కూడా తిరుమలకు ముడిపెట్టారని, ఇష్టానుసారంగా అర్హతలేని వ్యక్తులకు సైతం బ్రేక్ దర్శనాలు కల్పిస్తున్నారని విమర్శించారు. ప్రైవేటు పీవోలను పెట్టుకుని ఎలాంటి అవినీతికి పాల్పడ్డారో ఆధారాలతో సహా బయట పెడతానని చెప్పారు. బడా పారిశ్రామికవేత్తలతో స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతూ అధికార పార్టీకి వందల కోట్ల రూపాయల నిధులు ఇప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కేంద్ర ఎన్నికల కమిషన్ స్పందించి ఈవో ధర్మారెడ్డిని ఆ పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌కు మార్గదర్శకాలు!

అమరావతి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): కొత్త ఆర్థిక సంవత్సరం 2024-25 లో మొదటి 4 నెలల కోసం ఆమోదించిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మార్గదర్శకాలను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ మేరకు బుధవారం జీవో జారీ చేసింది. ఏప్రిల్ 1 నుంచి జూలై 31 వరకు ఈ బడ్జెట్ అమల్లో ఉంటుందని పేర్కొంది. 2024-25 ఆర్థిక సంవత్సరం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2.86 లక్షల కోట్ల బడ్జెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇందులో మూడోవంతు బడ్జెట్‌ను మొదటి నాలుగు నెలలకు వాడుకునేందుకు వీలుగా ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. పెండింగ్ బిల్లులను కొత్త ఆర్థిక సంవత్సరంలోకి మైగ్రేట్ చేస్తున్నట్టు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరానివి రూ.60 వేల కోట్ల పెండింగ్ బిల్లులున్నాయి. కానీ, వీటన్నింటికీ ప్రభుత్వం బడ్జెట్ కేటాయించలేదు. పైగా మూడోవంతు బడ్జెట్‌కే ఆమోదం తెలిపారు కావున, ఇందులో మూడోవంతు పెండింగ్ బిల్లులే మైగ్రేట్ అయ్యే అవకాశం ఉంది. బడ్జెట్ లేని బిల్లులను మళ్లీ మొదటి నుంచి ఫైలు పెట్టి కొత్తగా బిల్ నెంబర్ తీసుకుని తిరిగి వ్యవస్థలోకి తెచ్చుకోవాలి.

ఇప్పటికి రూ.34 కోట్లు సీజ్!

» 3,300 ఎఫ్ఐఆర్‌లు నమోదు

» సీ-విజిల్ యాప్ ద్వారా పెద్ద ఎత్తున ఫిర్యాదులు

» రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్ కుమార్ మీనా

అమరావతి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకూ రూ.34 కోట్ల విలువైన నగదు, వస్తువులు సీజ్ చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా తెలిపారు. రూ.11 కోట్ల నగదు, రూ. 7 కోట్ల మద్యం, రూ.10 కోట్ల విలువ చేసే బంగారం, వెండి ఆభరణాలను తనిఖీ బృందాలు స్వాధీనం చేసుకున్నాయన్నారు. వీటికి సంబంధించి 3,300 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు. ఈసీకి సీ-విజిల్ యాప్ ద్వారా పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందుతున్నాయని చెప్పారు. ఇప్పటికి 5,500 ఫిర్యాదులు అందగా, 3,040 ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్న హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలపై 1,600 ఫిర్యాదులు, అనుమతులు లేకుండా ప్రచారం చేస్తున్న వాటిపై 107 ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అనుమతి లేకుండా వాహనాల వాడకంపై 43, మతపరమైన ప్రచారాలపై 28, నగదు పంపిణీపై 29, మద్యం పంపిణీపై 17 ఫిర్యాదులు వచ్చాయని మీనా వివరించారు.